
ముదినేపల్లిలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


ఏలూరు పోస్టల్ కాలనీలో నాగేంద్రునికి పాలు పోస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో షష్ఠి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో స్వామికి అర్చకులు ప్రత్యేక అలంకరణ, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పుట్టలో పాలుపోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు దీరారు.


అత్తిలిలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

■ లోపలి పేజీలో..



- నూజివీడులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ప్రజల సెంటిమెంటును మన్నించి నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.



- ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి అంతరాలయ దర్శనం గురువారం నుంచి పునః ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.


అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన ఎంపీటీసీలు

బుట్టాయగూడెం ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

బుట్టాయగూడెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం మండల పరిషత్ అధ్యక్షురాలు కారం శాంతిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆర్డీవో ఎంవీ రమణ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 15 మంది ఎంపీటీసీలకు 11 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసినట్టు ఆయన తెలిపారు. ఎంపీపీ నిర్వర్తించాల్సిన విధుల్లో ఆమె భర్త కలుగజేసుకుని అన్నీ తానై వ్యవహరించ డాన్ని నిరసిస్తూ సెప్టెంబరు 25న వైసీపీ ఎంపీటీసీలు తొమ్మిది మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఆర్డీవోకు పంపించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 10న అవిశ్వాస తీర్మానం పంపిన ఎంపీటీసీలకు ఆర్డీవో 26న అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్టు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన తీర్మాన సమావేశానికి దొరమామిడి-2 ఎంపీటీసీ కారం శాంతి, కోటనాగవరం ఎంపీటీసీ కుక్కల వరలక్ష్మీ, లక్ష్మ్ముడుగూడెం ఎంపీటీసీ చరపు సుజాత, బుట్టాయగూడెం-1 ఎంపీటీసీ కరాటం పణీంద్రకుమార్ హాజరు కాలేదు. మిగిలిన 11 మంది వైసీపీ, న్యూడెమోక్రసీ, టీడీపీ ఎంపీటీసీలు సమావేశానికి హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో శాంతిపై ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గింది. ఈ మేరకు నివేదికను కలెక్టర్ పంపిస్తామని, తదుపరి ఎంపీపీ ఎవరనే దానిపై అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఆర్డీవో తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన సమావేశంలో పాల్గొనని కుక్కల వరలక్ష్మీ తర్వాత తీర్మానానికి అను కూలంగా ఓటు వేసిన వారితో కలవడం కొసమెరుపు.



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్

సోషల్ ఆడిటింగ్ .. ఆపై పాఠశాలలకు రేటింగ్

ఏలూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి రేటింగ్ ఇవ్వనున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్ పెర్ఫార్మెన్స్‌లను తెలుసుకునేందుకు సమగ్రశిక్ష ఏటా నిర్వహించే సోషల్ ఆడిటింగ్‌పై బుధవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జిల్లాలోని నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు డివిజన్ల సీఎంఆర్‌టీ/సీఆర్పీలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్ కుమార్ మాట్లాడుతూ వాస్తవ విషయాలను మాత్రమే నివేదికల్లో పొందుపర్చాలన్నారు. జిల్లాలోని 2,354 పాఠశాలలను సందర్శించి సమగ్ర సమాచారం సేకరించేందుకు కేటాయించిన 46 అంశాలతో కూడిన ప్రశ్నావళిని భర్తీచేయాలన్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆయా పాఠశాలలకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రేటింగ్ ఇస్తారన్నారు. సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) డి.యెహోషువా మాట్లాడుతూ సీఆర్పీలు అందించే నివేదికలే ప్రామాణికంగా ఏ,బీ,సీ రేటింగ్‌లను కేటాయిస్తారన్నారు. ఏఎంవో రామారావు, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జీసీడీవో నవీన కుమారి, ఏఎస్‌వో రామకృష్ణారావు, హెచ్ఎం కుటుంబరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు గుడ్డు.. కట్ !

నూజివీడు టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణ బాలరిష్టాలను అధిగమించలేకపోతున్నారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నూజివీడు క్యాంపస్‌లో పాత మెస్ టెండర్లు అక్టోబరుతో పూర్తవ్వగా నాటి నుంచి మెస్‌ల నిర్వహణ బాధ్యత రెండు ముక్కలు అయింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మూడు రోజులుగా గుడ్లను అందించడం నిలిచిపోయింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటిగ్రేటెడ్ విద్యను అభ్యసిస్తున్న దాదాపు ఎనిమిదిన్నర వేల మంది విద్యార్థులకు సంబంధించి శాఖాహార భోజనాన్ని దసరా సెలవల అనంతరం అక్షయపాత్ర అనుబంధ సంస్థకు అప్పగించగా మాంసాహార భోజనం అందించే బాధ్యతను ట్రిపుల్ ఐటీలో విద్యార్థులచే నడపబడుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ తీసుకుంది. మాంసాహారం అందించేందుకు ఒక్కో విద్యార్థికి వారానికి 46 రూపాయలు చెల్లించేందుకు ఆర్జీయూకేటీ ధరను నిర్ణయించగా ఆ మేరకు వారానికి నాలుగు గుడ్లు, ఒకరోజు మాంసాహారం విద్యార్థికి అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఒంటి గంట దాటితే కోడిగుడ్డు కానరాదని, మాంసాహారం అయిపోయిందని చెబుతున్నారని విద్యార్థులు గత ఆదివారం ఆందోళనకు దిగడంతో మాంసాహారం అందించే బాధ్యత నుంచి హెల్పింగ్ హ్యాండ్స్ - మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి మనోహర్, చిత్రంలో మంత్రి పార్థసారథి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏం చేద్దాం..!

చాన్నాళ్లకు డీఆర్‌సీలో అర్థవంతమైన చర్చ

చాన్నాళ్ల తర్వాత జిల్లా సమీక్షా కమిటీ సమావేశం(డీఆర్‌సీ)లో అజెండాపై అర్థవంతమైన చర్చ సాగింది. పొరపాట్లకు తావివ్వకుండా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను పరిష్కారానికి మమ్మెకమై పాటు పడుదామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి అంశంపై ఆయన 'ఏం చేద్దాం.. ఏ చర్యలు తీసుకుందాం..' అంటూ ఎమ్మెల్యేలు, అధికారులతో చర్చించారు.

- పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు మమేకం
- జిల్లా యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసిన మంత్రి నాదెండ్ల
- ఇళ్లు సగంలో వదిలేసిన కాంట్రాక్టర్లపై చర్యలు : మంత్రి కొలుసు
- సమస్యలపై గళమిప్పిన ఎమ్మెల్యేలు

ఏలూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో డీఆర్‌సీ సమావేశం మంత్రి ఇన్‌చార్జి నాదెండ్ల అధ్యక్షతన బుధవారం మూడు గంటల పాటు సాగింది. రోడ్లు, యూరియా కొరత, ఇళ్ల నిర్మాణాలు, 22ఏ తదితర అంశాలపై చర్చ చేపట్టారు. తొలుత మంత్రి రబీకి యూరియా కొరత ఉందా? ఏం చేద్దామంటూ ఎమ్మెల్యేల నుంచి ఆరా తీశారు. పోలవరం మండలంలో మొక్కజొన్నకు యూరియా అవసరమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంత్రిని కోరారు. మనోహర్ మాట్లాడుతూ 'జిల్లాలో ధాన్యం సేకరణకు రైతుల కోసం 65 లక్షల నాణ్యమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచాం. ఈనెల 28 నుంచి తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రతీ రైతు సేవాకేంద్రం వద్ద 20 నుంచి 25 వరకు టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాం. రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొంటాం' అన్నారు. రోడ్ల మరమ్మతులు లేకపోవడం.. ప్రధాన రహదారుల వెంబడి, మార్జిన్లు వెంబడి ఆర్అండ్‌బీ అధికారులు రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ట్రామాకేర్ సెంటర్ రిఫర్ చేస్తున్న కేసులు సగటున ప్రతీ నెల 50 వరకు ఉండటంపైనా ఆందోళన వ్యక్తం - మిగతా 8వ పేజీలో

● నిషేధిత భూముల్లోకి ఎలా చేర్చారు?

ప్రభుత్వ ఆదేశాలతో డీఆర్‌సీలో 22ఏ నిషేధిత భూములపై చర్చకు ప్రవేశపెట్టారు. దీనిపై మంత్రి నాదెండ్ల రెవెన్యూ యంత్రాంగాన్ని, కలెక్టర్‌ను ఆరా తీశారు. దీనిపై అరగంటకు పైగా చర్చ సాగింది. 22 ఏ కింద 205 దరఖాస్తులు రాగా 125 పరిష్కారానికి సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమస్య జిల్లా అంతా ఉంటుందని, ఒక గ్రీవెన్ సెల్ నిర్వహిస్తే అందరి సమస్యలను స్వీకరించవచ్చని నాదెండ్ల వివరించారు. మంత్రి కొలుసు మాట్లాడుతూ ప్రజల ప్రైవేట్ భూములను ఉద్దేశపూర్వంగా కొంత మంది అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని, అటువంటి భూములను గుర్తించాలని సూచించారు. అలా చేర్చిన వారిపై చర్యలుండాలని కోరారు.

మంత్రి మనోహర్ డెడ్‌లైన్లు..సూచనలు

- డిసెంబరు 16న కలెక్టరేట్‌లో 22ఏ (నిషేధిత భూముల్లో చేర్చిన) అంశంపై జిల్లాలోని మూడు డివిజన్‌ల నుంచి వినతుల స్వీకరణకు మెగా గ్రీవెన్స్ డే నిర్వహణ ... వచ్చిన దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి.
- జిల్లాలో పీఎంఏవై 1,2 కింద మంజూరైన 38 వేల ఇళ్లను మార్చి నాటికి పూర్తి చేయాలి
- రబీ సీజన్‌లో వారం వారం ఎమ్మెల్యేలతో యూరియాపై సమీక్షించి. కలెక్టర్ దృష్టిలో పెట్టి ఆ మేరకు సరఫరాకు వ్యవసాయశాఖ జేడీ పర్యవేక్షించాలి.
- జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులపై ఏర్పడిన గోతులకు రెండువారాల్లో మరమ్మతులు పూర్తి చేయాలి.
- పెట్టుబడుల సదస్సులో జిల్లాకు వచ్చిన ఐదు పరిశ్రమలకు సంబంధించిన అనుమతులు, ఇతర అంశాలను వేగంగా పరిష్కరించాలి.
- ఏలూరు ఆశ్రం నుంచి టౌన్‌లోకి ప్రవేశించే ప్రాంతాల్లో రోడ్డు అభివృద్ధి చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని లైట్లు ఏర్పాటు చేయాలి.
- విజయరాయి కోకోనట్ బోర్డులో మదర్ విత్తన చెట్ల పంపిణీలో అవకతవలపై ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటుకు మంత్రి సూచించగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

అదరగొట్టారు

మాక్ అసెంబ్లీకి జిల్లా విద్యార్థుల హాజరు

ఏలూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం, రాజ్యాంగ విలువలపై అవగాహన, తదితర ప్రయోజనాలే లక్ష్యంగా విద్యాశాఖ రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఎంపిక చేసిన బాల ఎమ్మెల్యేలతో బుధవారం అమరావతిలో నమూనా అసెంబ్లీలో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో జిల్లాకు చెందిన ఏడుగురు బాల ఎమ్మెల్యేలు ప్రత్యేకత, వాగ్ధాటిని కనబరిచారు. అచ్చం అసెంబ్లీ సమావేశాల మాదిరిగానే నిర్వహించిన మాక్ అసెంబ్లీ సమావేశంలో బాల ఎమ్మెల్యేలనుద్దేశించి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రభుత్వ ప్రాధామ్యాలు, భావిభారత పౌరులుగా విద్యార్థుల బాధ్యతలపై ప్రసంగించి చైతన్యవంతం చేశారు. జిల్లా నుంచి మంత్రిగా ఎంపికైన ఉంగుటూరు మండలం పెదనింద్రకొలను జడ్పీ హైస్కూలు విద్యార్థి గురుప్రసాద్‌కు యువజన, క్రీడలశాఖ మంత్రిత్వశాఖను కేటాయించారు. ఒలింపిక్స్‌లో పతకాలు ఆంధ్రప్రదేశ్/ భారతదేశం క్రీడాకారులు సాధించడానికి కార్యాచరణపై ప్రతిపక్ష బాల ఎమ్మెల్యే సంధించిన ప్రశ్నకు మంత్రి గురుప్రసాద్ దీటైన సమాధానమిచ్చారు. ప్రజల జీవితాలతో ఆడుకునే ప్రభుత్వం తమది కాదని, ప్రజలతో ఆడించే ప్రభుత్వమని, ఆ మేరకు ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటే రూ.50 లక్షలు, స్వర్ణపతకం సాధిస్తే రూ.10 కోట్లు, రజత పతక విజేతకు రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధిస్తే రూ.3 కోట్లు ప్రోత్సాహక బహుమతులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని మంత్రి సమాధానమివ్వడం సభలో హైలైట్‌గా నిలిచింది. విద్యార్థుల్లోవున్న నైపుణ్యాలను గల్లీనుంచి ఢిల్లీవరకు, ఒలింపిక్స్ వరకు తీసుకెళ్లి ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి జవాబిచ్చారు.

ఇక అసెంబ్లీ మార్షల్‌గా దెందులూరు నియోజకవర్గ విద్యార్థి పూర్ణగణేష్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌గా నూజివీడు జడ్పీ హైస్కూలు విద్యార్థి గోపి నాగచైతన్య వ్యవహరించారు. అధికారపక్ష ఎమ్మెల్యేలుగా మణికంఠ (దెందులూరు), అస్మితసాయి (కైకలూరు), ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా నిఖిల్‌సాయి (పోలవరం), కె.వంశిక (చింతలపూడి), జి.లిఖిత (ఏలూరు) వ్యవహరించారు. వీరందరికీ పతకాలు, సర్టిఫికెట్లు, బాల రాజ్యాంగం బహుమతులుగా అందజేశారు. జిల్లా బాల ఎమ్మెల్యేల బృందానికి గైడ్ టీచర్లుగా పెదనింద్రకొలను జడ్పీ హైస్కూలు ఉపాధ్యాయుడు కె.సుబ్బరాజు, రంగాపురం జడ్పీ హైస్కూలు టీచరు జి.రమణి వ్యవహరించారు. నిజమైన శాసనసభలో బాల ఎమ్మెల్యేలతో - మిగతా 8వ పేజీలో


మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న బాల మంత్రి, పెదనింద్రకొలను జడ్పీ హైస్కూలు విద్యార్థి గురుప్రసాద్


శాసనసభ హాలు వద్ద జిల్లా స్టూడెంట్ ఎమ్మెల్యేలు, గైడ్ టీచర్లు

నేడు తంగెళ్ళమూడిలో జాతరకు ముడుపు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):తంగెళ్ళమూడిలో గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుల జాతర మహోత్సవాన్ని నిర్వహించేందుకు గురువారం ముడుపులు కట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్టు తంగెళ్ళమూడి అమ్మవార్ల జాతర కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు తంగెళ్ళమూడి యాదవనగర్ రామాలయం నుంచి అమ్మవారికి బిందెలతో పసుపు నీళ్ళు తీసుకుని వెళ్ళి గంగానమ్మ అమ్మవార్లకు స్నానాలు ఆచరిస్తారు. ఘట ఆవాహన చేసి ఉదయం 10 గంటలకు అమ్మవారిని పొలిమేర నుంచి ఆహ్వానించి 11.29 గంటలకు యాదవనగర్ రామాయలం వద్ద జాతర ముడుపు కట్టనున్నట్టు తెలిపారు.11.41 గంటలకు పందిరాటా నిలపనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్..

- రాగి వైరు దొంగిలించి విక్రయాలు
- అన్నదాతకు అపార నష్టం

■ లోపలి పేజీలో..

రాజ్యాంగం దిక్సూచి వంటిది

- మంత్రి నాదెండ్ల
- కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం

ఏలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి హక్కులతో పాటు బాధ్యతలను పొందుపర్చిందని, ప్రజా స్వామ్యానికి దిక్సూచిలాంటిదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. గోదావరి సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద మంత్రులు నాదెండ్ల, కొలుసు పార్థసారథి, జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, పలువురు ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి నాదెండ్ల అధికారులు, ప్రజాప్రతినిధులతో భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చేయించారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు చంటి, ధర్మరాజు, బాలరాజు, జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి

పట్టాలకు మరమ్మతులతో 30 రైళ్లు రద్దు



ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మీదుగా నడుస్తున్న పలు రైళ్లను రద్దు చేస్తూ దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు పట్టాలపై ఆపరేషనల్ వర్క్‌ను గోదావరి, రాజమండ్రి, కడియం సెక్షన్ల పరిధిలో నిర్వహించనున్న దృష్ట్యా 30 రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు.

రద్దయిన రైళ్లు

రైల్ నెంబర్ 12718 విజయవాడ - విశాఖపట్నం 2026 జనవరి 29, జనవరి 31తేదీలలో రద్దు చేశారు. 12717 విశాఖపట్నం - విజయవాడ 2026 జనవరి 29, జనవరి 31న రద్దు చేశారు. నెంబరు 67262 విజయవాడ - రాజమండ్రి జనవరి 29న రద్దు చేశారు. నెంబరు 67261 రాజమండ్రి - విజయవాడ జనవరి 29, 17249 రేణిగుండ - కాకినాడ పోర్టు జనవరి 28, 17250 కాకినాడ పోర్టు - రేణిగుంట జనవరి 29, 17239 గుంటూరు - విశాఖపట్నం జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారు. నెంబరు 17240 విశాఖపట్నం - గుంటూరు జనవరి 29 నుంచి 31 వరకు, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జనవరి 29, 30 తేదీలలో రద్దు. 12805 విశాఖపట్నం - లింగంపల్లి జనవరి 28, 29, 67285 విశాఖపట్నం - రాజమండ్రి జనవరి 29, 31, నెంబరు 17480 తిరుపతి - పూరి జనవరి 27, 17479 పూరి - తిపురుతి జనవరి 28, 12775 కాకినాడ టౌన్ - లింగంపల్లి జనవరి 27, 12776 లింగంపల్లి - కాకినాడ టౌన్ జనవరి 28, 22708 తిరుపతి- విశాఖపట్నం జనవరి 28, 22707 విశాఖపట్టణం - తిరుపతి జనవరి 29, నెంబరు 17257 విజయవాడ - కాకినాడ పోర్టు జనవరి 29, 31, 17257 కాకినాడ పోర్టు - విజయవాడ జనవరి 29, 31, 67202 విజయవాడ - రాజమండ్రి జనవరి 29, నెంబరు 67201 రాజమండ్రి - విజయవాడ జనవరి 29న రద్దు చేశారు. నంబరు 67246 నర్సాపూర్ - రాజమండ్రి జనవరి 29, 67241 రాజమండ్రి - భీమవరం జంక్షన్ జనవరి 29, 17219 మచిలీపట్నం - విశాఖపట్నం జనవరి 28, 29, నంబరు 17220 విశాఖపట్నం - మచిలీపట్టణం జనవరి 29, 30, 07254 రాజమండ్రి - కాకినాడ పోర్టు జనవరి 31, 07523 కాకినాడ పోర్టు - రాజమండ్రి జనవరి 31, 22876 గుంటూరు - విశాఖపట్నం జనవరి 31, 22875 విశాఖపట్నం - గుంటూరు జనవరి 31న రద్దు చేశారు.

దారి మళ్లింపు..

రైల్ నంబర్ 17643 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు వెళ్ళే రైలు జనవరి 28న భీమవరం టౌన్ - కాకినాడ పోర్టు మధ్యలో ఉన్న అత్తిలి, తణుకు, నిడదవోలు, గోదావరి, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు స్టేషన్లలో తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు.

నంబరు 17655 కాకినాడ పోర్టు - పాండిచ్చేరి జనవరి 29న కాకినాడ పోర్టు, భీమవరం టౌన్ మధ్యలో ఉన్న కాకినాడ పోర్టు, కాకినాడ టౌన్, సామర్లకోట, అనపర్తి, ద్వారపూడి, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, అత్తిలి స్టేషన్లలో తాత్కాలికంగా రద్దు చేశారు.

13352 ఆల్పాస్ - ధన్‌బాద్ వెళ్ళే రైలు జనవరి 28న గోదావరి రైల్వే స్టేషన్‌లో రద్దు చేశారు. కొవ్వూరు, రాజమండ్రి, కడియం లైన్లలోని నెమ్మదిగా వెళ్ళే మార్గం ఈ రైలు నడపనున్నారు.

12804 అజరత్ నిజాముద్దీన్ - విశాఖపట్నం జనవరి 28న బల్లార్హా, వరంగల్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ స్టేషన్లలో రైలును రద్దు చేసి నాగపూర్, దర్గ జంక్షన్, లాక్‌బోలీ, సింగపూర్‌రోడ్, విశాఖపట్టణం మీదుగా రైలును నడపనున్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు..

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆరు రైళ్ళను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రైల్ నంబర్ 07027 చర్లపల్లి - బరంపూర్ ప్రతి శుక్రవారం నడిచే ఈ రైలును ఈ ఏడాది డిసెంబర్ 5 నుంచి జనవరి 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. రైల్ నెంబర్ 07028 బరంపూర్ - చర్లపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 6 నుంచి జనవరి 31 వరకు పొడిగించారు. 07035 చర్లపల్లి - అనకాపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 6 నుంచి జనవరి 17 వరకు పొడిగించినట్లు తెలిపారు. 07036 అనకాపల్లి - చర్లపల్లి ప్రతి ఆదివారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 7 నుంచి జనవరి 18 వరకు పొడిగించారు. 07651 జల్నా - చాప్రా ప్రతి బుధవారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 3 నుంచి డిసెంబర్ 31 వరకు పొడిగించారు. 07652 చాప్రా - జల్నా ప్రతి శుక్రవారం నడుస్తున్న ఈ రైలు డిసెంబర్ 5 నుంచి జనవరి 2 వరకు పొడిగించారు.

అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, నవం బరు 26 (ఆంధ్రజ్యో తి): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ అం తర్ కళాశాలల మహి ళల వాలీబాల్ పోటీలు, యూనివర్శిటీ జట్టు ఎంపిక కార్యక్రమం గోపన్నపాలెంలో మంగళవారం నిర్వహించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేసి క్రీడా జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతర్ కళాశాలల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల నుంచి 12 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నా యి. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వై.పోలి రెడ్డి, అబ్జర్వర్ పవన్ తదితరులు పాల్గొన్నారు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలల క్రీడల పోటీలు రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. మరో రెండు రోజుల పాటు సాగే ఈ క్రీడలు రెండో రోజు వాలీబాల్, క్రికెట్, ఖోఖోతోపాటు ఎస్సె రైటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ వి.సమత పర్యవేక్షించారు.

స్కూల్స్ గేమ్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర జట్టు కోచ్‌గా సూర్యనారాయణ



తణుకు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఈనెల 27 నుంచి 30 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే అండర్-19 ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సంకు సూర్యనారాయణ నియామకమైనట్టు పాఠశాల హెచ్‌ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. మండపాక పాఠశాలలో పీడీగా పని చేస్తూ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా సూర్యనారాయణ ఎంపిక కావడం ఐదోసారని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ సూర్యనారాయణను సర్పంచ్ జాన వెంకట లక్ష్మీ, ఉప సర్పంచ్ నగేశ్, నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మీ, తదితరులు అభినందించారు.







అత్తిలిలో సాంస్కృతిక కార్యక్రమాలు.. ఏలూరులో పుట్ట వద్ద భక్తుల పూజలు..పెనుగొండ మండలం నడిపూడిలో స్వామివారి రథోత్సవం

షష్ఠి సందడి

అంతటా షష్ఠి సందడి నెలకొన్నది. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సమయాల్లో రథోత్సవాలు నిర్వహించారు.







భీమవరం, ఏలూరులలో స్వామికి అభిషేకాలు.. గణపవరంలో సుబ్రహ్మణ్య స్వామి ఊరేగింపు..

నేటి నుంచి శ్రీవారి అంతరాలయ దర్శనం

శని, ఆదివారాలు, పర్వదినాల్లో రద్దు.. సాకారం అయిన భక్తుల ఏళ్లనాటి కల

టికెట్ రుసుము రూ.500



ద్వారకాతిరుమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేదీప్యమానంగా వెలుగొందుతూ అంతరాలయంలో కొలువుదీరిన శ్రీవారి దివ్యమంగళ రూపాన్ని దగ్గరగా కనులారా వీక్షించాలన్న భక్తుల ఏళ్లనాటి కల నేడు సాకారం కానుంది. అర్ధ దశాబ్ద కాలంగా నిలిచిన శ్రీవారి అంతరాలయ దర్శన భాగ్యం భక్తులకు నేటి నుంచి లభించనుంది. గురువారం నుంచి అంతరాలయ దర్శనాన్ని పునః ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. భక్తుల నుంచి అంతరాలయ దర్శనం కోసం పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వెల్లువెత్తడంతో ఈ దర్శనాన్ని పునరుద్ధరిస్తున్నారు. ఇందు నిమిత్తం ముఖ మండపము, అంతరాలయ దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో అంతరాలయ దర్శనాన్ని అలాగే ముఖమండప (అమ్మవార్ల ముందు నుంచి భక్తులను క్యూలైన్లలో పంపే ఏర్పాటు) దర్శనాన్ని రద్దు చేస్తామని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ప్రకటించారు.

టికెట్ రుసుముతో దళారులకు చెక్

ప్రస్తుతం వరకు వీఐపీలకు, పెద్దలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే అంతరాలయ దర్శనం లభించేది. అయితే సామాన్య భక్తులు బంగారు వాకిలి ముందు భాగంలో ఉన్న క్యూల నుంచే దర్శనంచేసుకుని వెళ్లేవారు. ముందుగా తూర్పు ద్వారం ముందున్న వాకిలి నుంచి అలివేలుమంగ అమ్మవారి దర్శనం చేసుకుని క్యూలైన్ల గుండా ముందుకు వెళ్తే వచ్చే ప్రధాన ద్వారం అనగా బంగారు వాకిలి ముందు నుంచి వెళ్తూ స్వామివారిని దర్శించుకునేవారు. అయితే వారికి ఆండాళ్ అమ్మవారి దర్శనం అయ్యేది కాదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దేవేరుల దర్శనం పూర్తిగా జరుగక అసంతృప్తితో ఉండేవారు. అయితే ప్రస్తుతం అంతరాలయ దర్శనంతో పాటు ముఖమండప దర్శనం అనగా అమ్మవార్ల ముందు నుంచి భక్తులు నడిచి వెళ్లే వీలు కల్పించారు. అలాగే అంతరాలయానికి వెళ్లే ప్రతి భక్తుడు రూ.500 టికెట్టు కొనుగోలు చేయాల్సి ఉంది. అధికారులు తీసుకున్న ఈచర్యతో ఇక దళారులకు చెక్ పడినట్లేనని భక్తుల భావిస్తున్నారు. ఇప్పటి వరకూ అంతరాలయ దర్శనం కోసం కొందరు భక్తులు పలుబడి ఉన్న దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు ఒక్కో భక్తుని నుంచి నగదు వసూలు చేసి దర్శనానికి పంపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు టికెట్టు ఉండటం వల్ల దళారులతో ఇక పనిలేదని సొమ్ము మొత్తం దేవునికే చెందుతుందని భక్తులు అంటున్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జస్వీర్‌సింగ్ దింపా

సంస్థాగతంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

నరసాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):సంస్థాగతంగా బలోపేతం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని ఏఐసీసీ పరిశీలకులు, పంజాబ్ మాజీ ఎంపీ జస్వీర్‌సింగ్ దింపా అన్నారు. పట్టణంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో పీసీసీ పనితీరుతో పాటు కాంగ్రెస్ నాయకులంతా కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఏపీ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ప్రధాని మోదీ విధానాలతో దేశంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ ఓట్ల చోరీతో అధికారంలోకి వచ్చిందన్నారు. రోడ్ల అభివృద్ధి, పరిశ్రమల పేరుతో రైతుల నుంచి లక్షలాది ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందన్నారు. తూతూమంత్రంగా పరిహారం చెల్లించి రైతుల్ని దగా చేస్తుందని దింపా మండిపడ్డారు. అనంతరం ఆయన నరసాపురం పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్‌రాజు, పోలిశెట్టి బాబ్జీ, గాదిరెడ్డి వనమయ్య, ఆర్జునరావు, జి.బాబీ, హనుమంతురావు, గోపాలరావు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన మంత్రి నిమ్మల

వృద్ధురాలికి సిలిండర్, నీటి కుళాయి కనెక్షన్ అందజేత





మంత్రి హామీ మేరకు వృద్ధురాలికి ఇంటి వద్ద సమకూర్చిన గ్యాస్ స్టవ్, కుళాయి.. చిత్రంలో ధర్మారావు ఫౌండేషన్ ప్రతినిధులు

యలమంచిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి గ్రామం తాడిగరువుతోటలోని తాటాకింట్లో నివసిస్తున్న వృద్ధురాలు సాధనాల సత్యవతికి గతనెల 1వ తేదీన పింఛన్ అందించేందుకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆమె ఇంటికి వెళ్లగా.. ఇంట్లో కట్టెలపొయ్యిపై వృద్ధురాలు వంటచేస్తూ కనిపించింది. దీనితో వృద్ధురాలి కష్టాన్ని మంత్రి రామానాయుడు చూశారు. కుళాయి కనెక్షన్ కూడా లేకపోవడంతో వృద్ధురాలి పేదరికపు పరిస్థితిని స్వయంగా చూసిన మంత్రి రామానాయుడు వెంటనే స్పందించారు. తన తండ్రి ధర్మారావు ఫౌండేషన్ ద్వారా గ్యాస్‌స్టవ్, సిలిండర్, కనెక్షన్, మోటారుతో కూడిన కుళాయి కనెక్షన్ అందిస్తానని వృద్ధురాలికి హామీ ఇచ్చారు. మంత్రి రామానాయుడు ఇచ్చిన హామీ మేరకు గ్యాస్‌స్టవ్, సిలిండర్, కనెక్షన్, మోటారుతో కూడిన కుళాయి కనెక్షన్‌ను సమకూర్చారు. వీటిని ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు పీతల శ్రీనివాస్, బొప్పన హరికిషోర్, గొడబ కుమార్ తదితరులు వృద్ధురాలు సత్యవతికి బుధవారం అందజేశారు. దీంతో వృద్ధురాలు సంతోషాన్ని వ్యక్తంచేస్తూ మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఏఆర్‌డీజీకే విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌డీజీకే ప్రైమరీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వి.కాంతి జయకుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు రాచకొండ వసంత్‌కుమార్, కొత్తపల్లి హేమచంద్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.జోజిబాబు, టి.శ్రీనివాస్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఎటుచూసినా.. చెత్త కుప్పలే

» అన్ని రోడ్లపై కుప్పలు.. కుప్పలుగా చెత్త గుట్టలు

» క్షీణిస్తున్న పారిశుధ్యం » కంపోస్టు యార్డు లేకపోవడం వల్లే సమస్య





స్టీమర్‌రోడ్‌లోని రాజగోపాలస్వామి గుడి వద్ద.. టీటీడీ కళ్యాణ మండపం వద్ద పేరుకుపోయిన చెత్త





వలంధర్‌రేవు సమీపంలో వేసిన చెత్త.. బుధవారం రాత్రి సబ్ జైలు వద్ద పేరుకుపోయిన చెత్త

నరసాపురం పట్టణం చెత్త కుప్పలకు కేరాఫ్‌గా మారింది. ఏ రహదారిపై చూసినా... ఏ సెంటర్‌లో చూసినా.. ఏ వీధిలో చూసినా... చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. గోదావరి గట్టు రోడ్డుకు ఒక వైపున కూడా గుట్టలే కనిపిస్తున్నాయి.

నరసాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసాపురంలో పారిశుధ్య సిబ్బంది రోడ్లను శుభ్రం చేసి, ఇటు ఇళ్ల నుంచి చెత్తను సేకరించి వాటిని రోడ్లపై ఉన్న డస్ట్ బిన్నుల్లో పడేస్తున్నారే తప్ప అక్కడ నుంచి తొలగించడం లేదు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి. ఆ కుప్పల వద్ద పశువులు, పందులు దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా శానిటేషన్ సమస్య తలెత్తుతున్నది. ఇటు ప్రజలు కొన్ని సెంటర్ల వైపు వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యకు ప్రధాన కారణం కంపోస్టుయార్డు లేకపోవడమే.

ఎక్కడ చూసినా ఆందోళనలు

ఇప్పటి వరకు సేకరించిన చెత్తను స్మృతివనం వద్ద, గోదావరి గట్టుపై వేసేవారు. నది జలాలు కలుషితం అవుతున్నాయంటూ పట్టణానికి చెందిన ఓసూరి ఫణికర్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం మూడు నెలల్లో తొలగింపునకు గడువు ఇచ్చింది. ప్రస్తుతం గడువు ముగియడంతో మళ్లీ అక్కడ చెత్త వేయడం లేదు. ఇటీవల 28వార్డులోని మునిసిపాలిటీకి చెందిన తుంగపాటి చెరువులో చెత్తను వేసే ప్రయత్నం చేశారు. అక్కడ ప్రజలు ధర్నాలకు దిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటు మునిసిపల్ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో వేయాలని ప్రయత్నించారు. దీనికి కూడా ధర్నాలు, ప్రతిఘటనలు ఎదురయ్యాయి. చివరికి పాలకొల్లు రోడ్‌లో ఏటిగట్టుకు వెళ్లే రోడ్‌కు ఒక వైపున ఖాళీగా ఉన్న స్థలంలో వేస్తూ వచ్చారు. మంచినీటి చెరువు, ఆలయ సమీపంలో చెత్త వేయడంపై స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ కారణంగా బుధ, గురువారాల్లో సేకరించిన చెత్తను మునిసిపల్ డస్ట్‌బిన్నుల పక్కనే వేసేశారు. ఈ చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

చెత్త వేయొద్దంటూ ఆందోళన



రుస్తుంబాదలో చెత్త లారీని అడ్డుకున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మా ప్రాంతంలో చెత్తను వేయొద్దంటూ బుధవారం గ్రామస్థులు ఆందోళన చేశారు. రుస్తుంబాద గ్రామంలోని మండవారి గరువు వద్ద ఖాళీ స్థలంలో చెత్త వేసేందుకు వచ్చిన లారీని ప్రజలు అడ్డుకున్నారు. ఇక్కడ చెత్త వేస్తే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో చెత్త వేసేందుకు వచ్చిన లారీ వెనుతిరిగింది. నివాసిత ప్రాంతాల సమీపంలో చెత్త వేయడం వల్ల ప్రజల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మునిసిపల్ అధికారులు చెత్త డంపింగ్ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో గ్రామస్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కొన్న స్థలంలోనే వేసే ప్రయత్నం చేస్తాం

అంజయ్య, కమిషనర్



పట్టణ పరిధిలో 31 వార్డులు ఉన్నాయి. రోజుకు 30 టన్నుల చెత్త వస్తుంది. ప్రస్తుతం ఈ చెత్తను ఎక్కడ వేయాలన్నదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఏడాది క్రితం రూ.3కోట్లు పెట్టి మండవారిగరువు వద్ద స్థలం కొనుగోలు చేసింది. అయితే ఆక్కడ స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అయినప్పటికీ వారితో చర్చించి తాత్కాలికంగా చెత్త వేసే ప్రయత్నం చేస్తాం. అదొక్కటే మార్గంగా కనిపిస్తుంది. ఇక మునిసిపాలిటీకి పట్టణ పరిధిలో చాలా స్థలాలు ఉన్నాయి. ఎక్కడ వేసినా.. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది. అధికారులకు నాయకులు కూడా సహకరించినప్పుడే ఈసమస్య పరిష్కారానికి నోచుకుంటుంది.


రైతులతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

రైతులకు అండగా ఉంటాం

మంత్రి నాదెండ్ల మనోహర్

నిడమర్రు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో వరి ధాన్యం ఆరబెట్టుకొంటున్న రైతులతో ఆయన ముచ్చటించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి మంత్రి నాదెండ్ల రైతులతో ముచ్చటించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఐకేపీ సిబ్బంది ఆలస్యం కాకుండా తక్షణం లారీలు పెట్టాలని ఆదేశించారు. ధాన్యం సంచులు మంచివి అందించాలని వ్యవసాయశాఖ జేడీని ఆదేశించారు. సర్వర్ సమస్యలు ఏమున్నా పరిష్కరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులు సమస్యలు పరిష్కరించాలన్నారు. ధాన్యం సొమ్ముల గురించి ప్రస్తావించగా 24 గంటల్లోనే సొమ్ము ఖాతాల్లో జమచేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రైతుల హర్షధ్వానాల మధ్య మనోహర్ మాట్లాడుతూ ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చేబ్రోలు నుంచి తల్లాపురం వెళ్లే రహదారి గోతుల మయంగా ఉండటంతో రోడ్డు వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, ఏడీ ఉషారాజకుమారి, ఏవో ప్రవీన్ , ఏఎంసీ ఛైర్మన్ జ్యోతి అయ్యప్ప, జనసేన నాయకులు పంది రాంబాబు, నిమ్మల దొరబాబు పాల్గొన్నారు.

నారాయణపురం వంతెన ప్రారంభం

ఉంగుటూరు మండలం నారాయణపురంలో నూతనంగా నిర్మించిన వంతెనను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ధర్మరాజు, మిత్రుల సహకారంతో సుమారు రూ.30లక్షలతో నిర్మించిన నారాయణపురం వంతెనను నిర్మించారని స్థానికులు తెలియజేసి అభినందించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ గన్ని వీరాంజనేయులు, సర్పంచ్ అలకనంద, జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు, జ్యోతి అయ్యప్ప, నిమ్మల దొరబాబు, తోటశ్రీను, సంకు నాగేషు, సంకు కొండరావునాయుడు, టీడీపీ నాయకులు ముత్యాల స్వామి, కడియాల రవిశంకర్, బీజేపీ శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తన రైతుల ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుంచి ద్వారకాతిరుమల మండలం హనుమాన్‌గూడెం మొక్కజొన్న విత్తన రైతు లకు విత్తన బకాయిలు ఇప్పించి వెంటనే ఆదుకోవాలని, రైతులు అనుకూలమైన విత్తన చట్టం తేవాలని, విత్తన కంపెనీ నుంచి రైతులకు అగ్రిమెంట్ ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం- ఆంధ్రప్రదేశ్ విత్తన రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మొక్కజొన్న విత్తన రైతులు బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెం గ్రామంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు గంటా పాపారావు,పాలేటి సుభాస్ చంద్రబోస్, గుర్రం పాపారావు, వీరవల్లి శివనాగరాజు, వి.మోహన్‌రావు, వి.వీరవెంకట్రావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

పంటలకు మద్దతు ధర కల్పించండి

ఏలూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలనీ, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని వివిధ రైతు, కార్మిక, వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతాంగ, కార్మిక, వ్యవసాయ కూలీ, చేతి వృత్తులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలనే ఎస్‌కెఎం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఏలూరులో భారీ ర్యాలీ కలెక్టరేట్ వద్ద ధర్నా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు, బుద్దా వెంకట్రావు, రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన జరిగిన సభలో రైతు - కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాద్రి ఝాన్సీ, సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యువిఎఐయు కెఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె గౌస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి డేగా ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ఏలూరు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు మీదుగా నడుస్తున్న పలు రైళ్లను రద్దు చేస్తూ దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రైలు పట్టాలపై ఆపరేషనల్ వర్క్‌ను గోదావరి, రాజమండ్రి, కడియం సెక్షన్ల పరిధిలో నిర్వహించనున్న దృష్ట్యా 30 రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని దారి మళ్లించారు.

రద్దయిన రైళ్లు : 12718 నెంబర్ రైలు 2026 జనవరి 29, 31తేదీలలో, 12717, 17240, 67285 రైళ్లు 2026, 67285 జనవరి 29, 31 తేదీల్లో, 17239 రైలు 28 నుంచి 30వ తేదీ వరకు, 12806, 17220 రైలు 29, 30తేదీల్లో, 12805, 17219 రైలు 28, 29 తేదీల్లో, 17480, 12775 రైళ్లు 27వ తేదీన, 17249, 17479, 12776, 22708 రైళ్లు 28న, రద్దు చేయనున్నారు. అలాగే 67262, 67261, 17250, 22707, 67202, 67201, 67246, 67241 వ నెంబర్ రైలు 29వ తేదీల్లో 07254, 07523, 22876, 22875 నెంబర్లు కలిగిన రైళ్లు 31వ తేదీల్లో రైళ్లు రద్దు చేయనున్నారు.

దారిమళ్లింపు : రైల్ నెంబర్ 17643 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు వెళ్లే రైలు జనవరి 28న భీమవరం టౌన్ - కాకినాడ పోర్టు మధ్యలో ఉన్న అత్తిలి, తణుకు, నిడదవోలు, గోదావరి, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు స్టేషన్లలో తాత్కాలికంగా రద్దుద చేస్తున్నారు.

17655 కాకినాడ పోర్టు - పాండిశ్చరి జనవరి 29న కాకినాడ పోర్టు, భీమవరం టౌన్ మధ్యలో ఉన్న కాకినాడ పోర్టు, కాకినాడ టౌన్, సామర్లకోట, అనపర్తి, ద్వారపూడి, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, అత్తిలి స్టేషన్లలో తాత్కాలికంగా రద్దు చేశారు. 13352 ఆల్పాస్ - ధన్‌బాద్ వెళ్లే రైలు జనవరి 28న గోదావరి రైల్వే స్టేషన్‌లో రద్దు చేశారు. కొవ్వూరు, రాజమండ్రి, కడియం లైన్లలోని నెమ్మదిగా వెళ్లే మార్గం ఈ రైలు నడపనున్నారు. 12804 అజరత్ నిజాముద్దీన్ - విశాఖపట్టణం జనవరి 28న బల్హార్షా, వరంగల్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ స్టేషన్లలో రైలును రద్దు చేసి నాగపూర్, డర్గ జంక్షన్, లాక్‌బోలీ, సింగపూర్‌రోడ్, విశాఖపట్టణం మీదుగా రైలును నడపనున్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు : ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఆరు రైళ్లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 07027 చర్లపల్లి - బరంపూర్ ప్రతి శుక్రవారం నడిచే ఈ రైలును ఈ ఏడాది డిశంబర్ 5 నుంచి జనవరి 30 వరకూ పొడిగించినట్లు తెలిపారు. రైల్ నెంబర్ 07028 బరంపూర్ - చర్లపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలు డిశంబర్ 6 నుంచి జనవరి 31 వరకూ పొడిగించారు. 07035 చర్లపల్లి - అనకాపల్లి ప్రతి శనివారం నడుస్తున్న ఈ రైలు డిశంబర్ 6 నుంచి జనవరి 17 వరకూ పొడిగించినట్లు తెలిపారు. 07036 అనకాపల్లి - చర్లపల్లి ప్రతి ఆదివారం నడుస్తున్న ఈ రైలు డిశంబర్ 7 నుంచి జనవరి 18 వరకూ పొడిగించారు. 07651 జల్నా - చాప్రా ప్రతి బుధవారం నడుస్తున్న ఈ రైలు డిశంబర్ 3 నుంచి డిశంబర్ 31 వరకూ పొడిగించారు. 07652 చాప్రా - జల్నా ప్రతి శుక్రవారం నడుస్తున్న ఈ రైలు డిశంబర్ 5 నుంచి జనవరి 2 వరకూ పొడిగించారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్..

- ప్రాణాలకు తెగించి మరీ చోరీలు..
- నిర్మానుష్య ప్రాంతాలపై కన్ను
- రాగి వైరు దొంగిలించి విక్రయాలు
- అన్నదాతకు అపార నష్టం


దొరసానిపాడులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూస్తున్న రైతు (ఫైల్)

సులభంగా పని జరిగిపోవాలని దొంగలు రూటు మార్చారు. ఇళ్లు, దుకాణాల్లో దొంగతనానికి ప్రయత్నిస్తే ఎవరైనా పట్టుకుంటారని, సీసీ కెమెరాలకు చిక్కితే పోలీసుల నుంచి ముప్పు తప్పదని పొలాల వైపు మళ్లుతున్నారు. పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లను టార్గెట్ చేస్తున్నారు. ప్రాణాపాయం అని తెలిసి కూడా రిస్క్ చేస్తున్నారు.

(జంగారెడ్డిగూడెం రూరల్-ఆంధ్రజ్యోతి)

రాత్రి సమయాల్లో పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైర్ దొంగిలించడం సులభతరం కావడంతో ఈ నయా దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలోనే ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. తాజాగా కామవరపుకోట మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించే యత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ఒక వ్యక్తి మృతి చెందాడు.

ముందుగా రెక్కీ నిర్వహించి...

ట్రాన్స్ ఫార్మర్‌ను పగలకొట్టి అందులో రాగి వైరును దొంగిలించడం ఒకరిద్దరి వల్ల సాధ్యం కాని పని. కనీసం నలుగురు ఆపై ఒక ముఠాగా ఏర్పడి ముందుగా ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టాలో ఎంచుకుంటారు. ఆ రోజు సాయంత్రం చీకటి పడ్డ సమయంలో ఆ ప్రాంతానికి చేరుకుంటారు. దొంగతనం చేసే ట్రాన్స్ ఫార్మర్ దగ్గరలోనే మద్యం సేవిస్తున్నట్టు నటిస్తారు. ఎవరైనా ప్రశ్నిస్తే మద్యం తాగుతున్నాం అవ్వగానే వెళ్లిపోతామని చెబుతారు. అనంతరం ఎవరూ లేరని నిర్ధారించుకుని ఒకరిద్దరు వెళ్లి ట్రాన్స్ ఫార్మర్‌కు సంబంధించిన విద్యుత్ వైరును తొలగించి ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దింపి దానిని పగలగొట్టి అందులో రాగి వైరును తొలగిస్తారు. ఇదంతా కేవలం నిమిషాల్లోనే జరిగి పోతుంది. వెంటనే వారి వద్ద ఉన్న ద్విచక్ర, ఆటోలపై రాగి వైరుతో ఉడాయిస్తారు. ఇందులో కరెంటు పని తెలిసిన వ్యక్తి ఉంటాడు.

నిర్మానుష ప్రాంతాలే టార్గెట్...

నిర్మానుష్యమైన ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లను టార్గెట్ చేస్తున్నారు. వ్యవసాయ బోరులకు అందించే విద్యుత్ సరఫరాకు పొలాల్లో 11 కేవీ ద్వారా విద్యుత్‌ను ట్రాన్స్‌ఫార్మర్‌కు అందిస్తారు. రాత్రి సమయాల్లో ఎడ్జ్ ఫీజులను కర్రలతో కొట్టి పీకేయడం వల్ల ఆ ట్రాన్స్ ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను దింపి పగులగొట్టి అందులో రాగి వైరును దొంగిలిస్తున్నారు. కర్రతో కొట్టినప్పుడు ఎడ్జ్ ఫీజు ఊడకపోతే అటువంటి సమయాల్లో విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు.

'చోరీలు'

ద్వారకాతిరుమల: మండలంలో ఈ నెల్లో 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి రాగివైరు చోరీ చేశారు. వేంపాడులో ఆలపాటి మురళి పొలంలో ఈ నెల 3న దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ వైరును తస్కరించారు. దొరసానిపాడులో రైతులు మద్దిపాటి చినకొండలరావు, చిలుకూరి హరిబాబు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును తస్కరించారు. ధ్వంసమై ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌లను ఈ నెల 8న చూసిన రైతులు పోలీసులను ఆశ్రయించారు. ఈ నెల 9న రామన్నగూడెం చోరీలో రైతులు సయ్యద్ బడే సాహెబ్, కె. ఆనందరావులు తీవ్రం గా నష్టపోయారు.

రాగితీగ చోరీ యత్నంలో ఒకరి మృతి

కామవరపుకోట: తెలంగాణకు చెందిన ముగ్గురు పురుషులు ఇద్దరు మహిళలు రెండ్రోజుల క్రితం తూర్పుయడవల్లి పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగను అపహరించే క్రమంలో నాగరాజు అనే వ్యక్తి తీవ్రగాయాల పాలు కావడంతో అతనిని ముఠాలోని వ్యక్తి జంగా రెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజుపై తెలంగాణా ప్రాంతంలో అనేక కేసులున్నట్టు పోలీసులు నిర్ధారించారు.

రాగి వైరకు యమ డిమాండ్..

పొలాల్లో ఉండే ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2 లక్షల పైమాటే. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో దాదాపు రూ.1 లక్ష విలువైన 70 కేజీల రాగి వైరు ఉంటుంది. ఈ రాగి వైరును బహిరంగ మార్కెట్‌లో కేజీకి రూ.700 నుంచి రూ. వెయ్యి వరకు విక్రయిస్తున్నారు. దొంగ సొత్తు కాబట్టి ఏదో ఒక ధరకు అమ్మేస్తున్నారు. వీటిని విక్రయించడం కూడా సులభతరం కావడంతో ఇటువంటి దొంగతనాలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడానికి విద్యుత్ శాఖకు దాదాపు రూ.2 లక్షల పైనే ఖర్చు అవుతుంది.

లబోదిబోమంటున్న రైతులు..

మెట్ట ప్రాంతంలో అధికంగా బోర్ల కింద వ్యవసాయం సాగుతుంది. దీంతో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌లపై కన్నేస్తున్నారు. ట్రాన్స్ ఫార్మర్ దొంగతనానికి గురైతే ముందుగా పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేయాలి. పోలీసులు వివరాలు సేకరించి రైతుకి ఎఫ్ఐఆర్ అందే టప్పటికి దాదాపు వారం పడుతుంది. ఆ ఎఫ్ఐఆర్‌ను విద్యుత్ అధికారులకు అందిస్తే వారు ఉన్నతాధికారులకు పంపి, అక్కడ నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై పొలంలో బిగించే సరికి దాదాపు 20-30 రోజు పడుతుంది. దీంతో పంట పొలాలకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు.

మార్చి నుంచి టీచర్లు ఉద్యమబాట

ఫ్యాప్టో ఛైర్మన్ దృష్టికి టెట్ మినహాయింపు, ఆర్థిక అంశాలు

ఏలూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు, డిమాండ్లను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన జిల్లాల పర్యటనలో భాగంగా ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర ఛైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్ బుధవారం ఏలూరులోని పలు పాఠశాలలను సందర్శించి టీచర్లతో సమావేశమయ్యారు. ఆయనకు ఉపాధ్యాయులు నివేదించిన సమస్యలు, డిమాండ్లను స్థానిక మీడియాకు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ, పవన్‌కుమార్ తెలియజేశారు. ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని, 11వ పీఆర్సీ బకాయిల విడుదల, 12వ పీఆర్సీ నియామకం, మధ్యంతర భృతి(ఐఆర్), బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి తదితర డిమాండ్లను ఫ్యాప్టో ఛైర్మన్ ఎదుట ఉంచారని తెలిపారు. మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ రుణాల మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరారన్నారు. టీచర్ల డిమాండ్లు, సమస్యల పరిష్కారానికి వచ్చే ఏడాది మార్చి నెల నుంచి ఉద్యమబాట పట్టనున్నట్టు ఛైర్మన్ సాయిశ్రీనివాస్ ప్రకటించారని వెల్లడించారు. ఆయన వెంట ఎస్టీ యూ జిల్లా నాయకులు ప్రకాశరావు, వర్మ, రాఘవులు, సత్య నారాయణ, రామాంజనేయులు, బీజీటీవో స్కూలు హెచ్ఎం రత్నాకర్‌రావు ఉన్నారు.


టీచర్లతో మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ సాయిశ్రీనివాస్

పరారీలో నిందితుడి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉండడంతో చివరకు అతన్ని మహారాష్ట్ర షోలాపూర్‌లో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ అరెస్టు చేసింది. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2023లో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన కృష్ణాజిల్లా గూడూరు మండలం పోలవరం గ్రామానికి చెందిన మువ్వల వెంకటేశ్వరరావు (33) పై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2022లో రెండు పోక్సో కేసులు నమోదు అయ్యాయి. అరెస్టు కాబడి బెయిల్‌పై బయటకు వచ్చి అప్పటి నుంచి కోర్టుకు హాజరుకాకుండా పరారీ అయ్యాడు. దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసులు బృందాలు మహారాష్ట్రలోని షోలాపూర్, పూణే జిల్లాల్లో విస్తృతంగా గాలించారు. చివరకు షోలాపూర్ జిల్లాలోని షికల్పన్ గ్రామ సమీపంలో ఉన్న ఉజ్జానీ డ్యామ్ వద్ద మువ్వల వెంకటేశ్వరరావు చేపల వేట చేసుకుంటూ అక్కడే జీవిస్తున్నాడు. దీంతో అతనిని అరెస్టు చేసి తీసుకువచ్చారు. ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అతనిని బుధవారం కోర్టుకు హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించారు.

అక్రమంగా పశువులు తరలిస్తున్న లారీ సీజ్


లారీ స్వాధీనం చేసుకున్న పోలీసులు

జీలుగుమిల్లి, నవం బరు 26 : (ఆంధ్రజ్యో తి) : అక్రమంగా పశువుల్ని తరలిస్తున్న లారీని డీఎస్పీ సీఐ ఆధ్వర్యంలో ఎస్సై సీజ్ చేశారు. మంగళవారం జాతీయ రహదారిపై వెళుతున్న లారీని ఎస్సై వి.క్రాంతికుమార్ తనికీ చేయగా నిబంధ నలకు విరుద్ధంగా పశువుల్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. 45 పశు వుల్ని ఒరిస్సా రాష్ట్రం మేనా సంత నుంచి హైదరాబాద్‌కు తరలిస్తు న్నట్లు పోలీస్‌లు గుర్తించారు. లారీ ఒనర్‌పై కేసు నమోదు చేశారు. పశువుల్ని గోశాలకు తరలించారు. డీఎస్పీ బి.వెంకటేశ్వరావు, సీఐ బి.వెంకటేశ్వరావు, సిబ్బంది ఉన్నారు. అనంతరం రహదారిపై ద్విచక్ర వాహనాలు ఆపి రికార్డుల తనికీతోపాటు హెల్మెట్ ధారణపై ఎస్ఐ అవగాహన కల్పించారు. కొంతమంది వాహన దారులకు దగ్గరుండి హెల్మెట్ ధరింపజేసి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఒక వివాహితను ప్రేమ పేరు తో దగ్గరై ఆపై ఆమె ఇష్టానికి వ్యతి రేకంగా అత్యాచారం చేసినట్లు నేరం రుజువు కావడంతో అతనికి పదేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఒక వివాహిత తన భర్తతో మనస్పర్థలు వచ్చి ఆమె పుట్టింటికి వెళ్ళింది. ఆమె వద్దకు ప్రేమ పేరుతో జంగారెడ్డిగూడెంలోని శ్రీనివాస పురం బైపాస్ గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న శీలం సురేష్ (26) వెళ్ళి పరిచయం చేసుకుని పెళ్ళి చేసుకుంటా నని నమ్మించి ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా 2022 జనవరి నెలలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఈ సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ ఎం సాగర్ బాబు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ బాల సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేసి నింది తుడైన శీలం సురేష్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన శీలం సురేష్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధిం చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసి క్యూషన్‌కు జంగారెడ్డిగూడెం కోర్టు కాని స్టేబుల్ మణికంఠ, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి సుభాష్, కోర్టు మానిటరింగ్‌సెల్ హెడ్‌కానిస్టేబుల్ కెఎస్ఎన్ మూర్తి సహకరించారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కైకలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సహ జీవనం చేస్తున్న మహిళపై హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు కైకలూరు టౌన్ ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. మంగళవారం కైకలూరులో ఒక మహిళపై సీతనపల్లి గ్రామానికి చెందిన చిన్నం ఏసోబు కత్తితో దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. బాధితురాలు తీవ్ర గాయాలతో ఏ లూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికి త్స పొందుతుండగా పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన ఏసోబు ను తన స్వగ్రామమైన సీతనపల్లిలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్‌జైలుకు తరలించిన ట్లు ఎస్సై తెలిపారు. అయితే నేర తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఈ దాడి సంఘటనపై అమరావతి, ఏలూరు నుంచి క్లూస్ టీం విచారణ చేపట్టింది. దాడి జరిగిన ప్రదేశంలో రక్త నమూనాలను సేకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సాల్మన్ (ఫైల్)

మొగల్తూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రం గా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైనమిది. మొగల్తూరు పాతకాలువ సెంటర్ సమీపానికి చెందిన కత్తిమండ సన్నీ సాల్మన్ (30) ఈ నెల 11వ తేదీ రాత్రి తన పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో పాతకాలువ వద్ద గల ఒక ఫంక్షన్ హాల్ సమీపంలో సన్నీ బైక్ స్కిడ్ అయి రోడ్డుపై జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందడంతో ఆసుపత్రి నుంచి వచ్చిన సమా చారం మేరకు మొగల్తూరు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. రెండవ కాన్పు కోసం మృతని భార్య ప్రెగ్నింట్‌గా ఉన్న ఈసమయంలో సన్నీ మృతి చెందడంతో ఆకటు ంబంతో పాటు ఆప్రాంతంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడు మొగల్తూరు గ్రామంలో యువకులతో కలిసిమెలసి ఉంటూ క్రికెట్‌లో మంచి ప్రావీణ్యత ఉండటంతో క్రికెట్ ప్రియులు జరిగిన సంఘటనపై తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

జంగారెడ్డిగూడెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సాధారణ తనిఖీలలో భాగం గా బుధవారం సీఐ ఎంవి.సుభాష్, ఎస్సై ఎన్.వీరప్ర సాద్ పోలీసు సిబ్బందితో బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒరిస్సా నుంచి జంగారెడ్డిగూడెం పట్టణానికి ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తుం డగా నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి మూడు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. మొత్తం 1630 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎన్.వీరప్రసాద్ తెలిపారు. నిందితులను విచారణ చేయగా పట్టణానికి చెందిన వీపు వెంకటేష్,త‌ూంపాటి జీవరత్నంగా గుర్తించారు. వీరిద్దరూ పాత నేరస్తులేనని, వీరిపై ఇప్పటికే పలు కేసులున్నట్లు ఎస్సై తెలిపారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అందరికి న్యాయం అందించడమే రాజ్యాంగ లక్ష్యం



ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం మౌలిక లక్ష్యం సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరికి అందించడమని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పోలవరం లేకుండా పోలవరం జిల్లా హాస్యాస్పదం

న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్

బుట్టాయగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా ప్రభుత్వం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ అన్నారు. చాలాకాలంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు పోలవరం నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లను ఒక జిల్లాగా ఏర్పాటు చేస్తూ దానికి పోలవరం పేరు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలవరం నియోజకవర్గంలోని ఏ ఒక్క మండలాన్ని కూడా కలపకుండా పోలవరం పేరు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతం అంతా జిల్లాగా ఏర్పాటుచేసి పోలవరంగా నామకరణం చేయాలన్నారు.

నూజివీడులో న్యాయవాదుల ర్యాలీ

నూజివీడు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రజల సెంటిమెంటును కాపాడుతూ నూజివీడు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో, ముఖ్యమంత్రి హోదాలో ఆగిరిపల్లిలోను, నూజివీడు సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను యధావిధిగా ఉంచుతున్నట్లు మంత్రివర్గం ప్రకటించిందని నూజివీడు సెంటిమెంట్ గౌరవిస్తూ నూజివీడు నియోజకవర్గంను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని ఆయన కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మన్నెం రమేష్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను పక్కన పెట్టవద్దు : సిటిజన్ ఫోరం

నూజివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్ష మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న మంత్రివర్గ ఉపసంఘం నివేదికను పక్కన పెట్టవద్దని నూజివీడు సిటిజన్ ఫోరమ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఫోరమ్ ప్రతినిధులు పీవీ కుమార్, సబ్బినేని శ్రీనివాస్, ఎం రాజశేఖర్, సయ్యద్ ఫరూక్, గొల్లపూడి రవిబాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబునాయుడు నూజివీడు పర్యటనలలో ప్రజలకు హామీ ఇచ్చారని ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాజధానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్ కలిగిన నూజివీడు విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలోనే సీఎంను కలుస్తామని తెలిపారు.

28న దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ఈ నెల 28న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో అండర్-14 నుంచి 16 వరకు, జూనియర్ విభాగంలో అండర్-17 నుంచి 19 వరకు, సీనియర్ విభాగంలో 20 పైబడి వయసున్న పురుషులు, మహిళలకు పాల్గొనవచ్చునన్నారు. వీల్‌వన్, వీల్ టూ ఛైర్స్ వాడేవారు. మోకాలి క్రింది భాగం పనిచేయనివారు, పోలియో, మురుగుజ్జు వైకల్యం ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరింత సమాచారానికి 99487 79015 నెంబరులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మోటార్ సైకిళ్లపై వచ్చి అలజడి

భీమవరం క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కొంత మంది విద్యార్థులు కత్తులతో మోటార్ సైకిళ్లపై వచ్చి అలజడి సృష్టించినట్లుగా స్థానికంగా కలకలం రేగింది. బుధవారం చినరంగనిపాలెం సెంటర్‌లో ఈ అలజడి జరిగినట్లుగా చెబుతున్నారు. ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన కొంత మంది విద్యార్థినిలు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి ఒక వ్యక్తి వారిలో ఒకరిని ఢీకొట్టాడు. దీంతో వారిలో ఒక విద్యార్థిని ధైర్యం చేసి ఢీకొట్టిన వ్యక్తిని కొట్టడంతో అవమానానికి గురైన ఆ వ్యక్తి తన స్నేహితులకు ఫోన్ చేశాడు. దీంతో కత్తులతో వచ్చిన యువకులు అసలు విషయం తెలుసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయారని సమాచారం. దీనిపై వన్‌టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ చినరంగనిపాలెం సెంటర్‌లో గొడవ జరుగుతుందని సమాచారం రావడంతో వెళ్ళామని, అయితే అక్కడ ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి (23) అధిక మోతాదులో మాత్రలను మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఆ విద్యార్థి విద్యలో అత్యంత ప్రతిభతో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించాడు. ప్రస్తుతం బాయిస్ హాస్టల్‌లో ఉంటూ ఎంబీబీఎస్ మూడో సంవ త్సరం చదువుతున్నాడు. కుటుంబ సమస్యల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం బాయిస్ హాస్టల్‌లోనే అధిక మోతాదులో మాత్రలు వేసుకోవడంతో స్నేహితులు గమనించి ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తీసుకు వెళ్ళారు. అయితే ఈ విషయాన్ని ఆసుపత్రి అధికారులు, వైద్యులు గోప్యంగా ఉంచేందుకు ఆ విద్యార్థిని వీఐపీ ట్రీట్‌మెంట్ రూమ్‌లో పెట్టి ఎవ్వరిని అనుమతించకుండా వైద్యం చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ట్లుగా అతని స్నేహితులు చెప్తున్నారు. చివరకు ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేయడంతో ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు తీసుకున్న వాగ్మూలంలో కుటుంబ సమస్యలేనని పేర్కొన్నాడు.

వృద్ధురాలి అదృశ్యం

భీమవరం క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన పరిచర్ల శశిరేఖ (82) మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని ఆమె కోడలు మరియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

యువకుడి అరెస్టు...

ఏలూరు క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు గవర్నమెంటు హైస్కూలు ఆవరణలోకి భీమడోలు మండలం లింగంపాడు గ్రామానికి చెందిన గ్రంథి ప్రకాష్ (26) మద్యం తాగి ఆ పాఠశాల ఆవరణలోకి వెళ్ళి గొడవ చేస్తున్నాడు. దీంతో అక్కడ ఉన్న ఉపాధ్యాయులు వెంటనే శక్తి టీమ్‌కు కాల్ చేశారు. శక్తి టీమ్ పోలీసులు అక్కడికి వెళ్ళి అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి శ్రీవారి గోశాల గోవు మృతి

ద్వారకాతిరుమల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి గోసంరక్షణశాలలోని రెండు గోవులు ఇటీవల అకాలమరణం పొందిన విషయం మరవకముందే మరో గోవు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందింది. సరైన రక్షణలేక పోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంక్ కారణంగా గిరి జాతికి చెందిన ఓ గోవు మృత్యువాత పడటం ఆవేదనకు గురిచేస్తోంది. శ్రీవారి గోశాల సమీపంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌లో ప్రతి రోజూ 25 వరకు గోవులను మేత నిమిత్తం వదులుతారు. అదే విధంగా బుధవారం ఉదయం వదిలిన కొన్ని గోవుల్లో ఒకటి సెప్టిక్ ట్యాంక్ వద్దకు వెళ్లి మూతపై అడుగు వేసి లోనికి జారిపోయింది. దీంతో అది ఊపిరి అందక మృతి చెందింది. ఎప్పటికో గమనించిన సిబ్బంది దాని మృతదేహాన్ని వెలుపలకు తీశారు. మరమ్మతులకు గురైన సెప్టిక్ ట్యాంకర్లను సంబందింత విభాగపు అధికారులు గుర్తించకపోవడం, నాణ్యతా ప్రమాణాలు లేకుండా కట్టడాలు నిర్మించడం వల్లే ఇలా జరిగిందని భక్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే రెండు ఆవులు విద్యుత్ షాక్ కారణంగా మృతి చెంది ఉండవచ్చని పోస్టుమార్టం నివేదిక వచ్చినట్లు పశువైద్యులు చెబుతున్నారు.

రామశింగవరంలో పారిశుధ్యం పరిశీలన

పెదవేగి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రామశింగవరం, కూచింపూడి గ్రామాల్లో బుధవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించి గ్రామంలో పేరుకు పోయిన అపారిశుధ్యాన్ని చూసి, పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి పరిస్థితి గ్రామాల్లో కనిపిస్తే సహించేది లేదని ఆయన పంచాయతీ సిబ్బందిని హెచ్చరించారు. తక్షణం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలంటూ పంచాయతీ అధికారులను ఆదేశించారు. సంపూర్ణ పారిశుధ్య లక్ష్యం నెరవేరాలంటే కష్టపడాలన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వ్యక్తిపై కేసు

భీమడోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పోలవరం కుడి కాలువ గట్టు నుంచి గ్రావెల్‌ను ఎత్తుకుపోతున్న లారీని భీమడోలు పోలీసులు అడ్డుకుని కేసు నమోదు చేశారు. ద్వారకా తిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల నుంచి పోలవరం కాలువ గట్టుపై ఉన్న కంకరను దెందులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నరెడ్ల చిట్టిబాబు గ్రావెల్‌ను తీసుకు వెళుతుండగా భీమడోలు జంక్షన్‌లో పోలీసులు అడ్డుకుని లారీ డ్రైవర్ చిట్టిబాబు, లారీ యజమాని ప్రత్తిపాటి పెద్దిరాజులపై కేసు నమోదు చేశారు.

కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరించాలి: బలరాం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంత ప్రజల సమ స్యలు పరిష్కరించాలని, ప్రజలు, రైతులు జీవించే హక్కును కాపా డాలని సీపీఎం నాయ కులు బి.బలరాం పేర్కొన్నారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో కొల్లేరు సమస్యల పరిష్కారానికై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంలేదన్నారు. కొల్లేరు ప్రజల జీవన విధానాన్ని మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. బలరాం మాట్లాడు తూ కొల్లేరులో వేలాది మంది ప్రజలు పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోతున్నారని తెలిపారు. కొల్లేరును ధ్వంసం చేసిన సందర్భంలో కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారన్నారు. ఇప్పటికైనా కొల్లేరు ప్రజల జీవన విధానాన్ని మార్పు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని పలు వురు నాయకులు ఈ సమావేశంలో వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నాయకులు, పెద్దలు ఎం.ఎస్.ఎస్.గంగాధరరావు, ఎం.కొండలరావు, జి.పార్థసారథి, జి.ఖ్యాతి పుష్పశ్రీ, ఎ.కాశిరాజులు పాల్గొన్నారు. నాయకులు పి.రామకృష్ణ, ఎస్.మహంకాళి రావు, కట్టా భాస్కరరావు, ఎస్.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, ఎ.రవి పాల్గొన్నారు.

పట్టిసీమ విద్యార్థినికి జిల్లా కలెక్టర్ ప్రశంసలు



పోలవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబ రచిన పట్టిసీమ జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తర గతి విద్యార్థిని సందక బిందు అక్షయని బుధవా రం కలెక్టర్ వెట్రి సెల్వి ప్రశంసించారు. అనంత రం మెడల్ బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మూర్తి, సత్యనారాయణ అభినందించారు.

అదనపు తరగతిగది మంజూరుకు ఫ్యాప్టో వినతి

ఏలూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం మండలం కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గదులను నిర్మించడానికి చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తూ బుధవారం సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్‌కు ఫ్యాప్టో జిల్లా నాయకులు మోహన్, ప్రకాశ్ వినతిపత్రాన్ని అం దజేశారు. విద్యార్థులంతా ఒక్క తరగతిగదిలోనే అన్ని క్లాసులకు టీచర్లు బోధిస్తు న్నారని, ఇంకా పలు సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.

22(ఏ) స్థలాల సమస్య పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం ఏరియాలో ఉన్న 22ఏ స్థలాల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే బడేటి చంటి వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన స్థలాల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాన్నారు. ఈ సమస్యను 30 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 16న ఈ సమస్యపై ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జాబ్ మేళాలో 107 మందికి కొలువులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సూర్య డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 253 మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొనగా 107 మంది వివిధ కంపెనీల్లో కొలువులు సాధించినట్టు సూర్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈడ శ్రీనివాసరావు తెలిపారు. పదిహేడు కంపెనీల ప్రతినిధులతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, మండలాధ్యక్షుడు కుక్కల మాధవరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు,పరిమి సత్తిపండు,షేక్ ముస్తఫా పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో రక్తదాన శిబిరం

ఏలూరు రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు విద్యుత్ భవన్లో బుధవారం ఉచిత మెడికల్, రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు ప్రారంభించి మాట్లాడారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు గుడ్డు.. కట్!

(5వ పేజీ తరువాయి)

సంస్థ తప్పుకున్నట్టు సమాచారం. దీంతో మూడు రోజులుగా విద్యార్థులకు గుడ్డు అందడం లేదు. మరోవైపు శాఖాహార భోజనంలో ఉదయం అల్పాహారంగా కట్టి పొంగలి ఇస్తున్నారని ఉదయం మసాలాతో కూడిన ఆహారం తినడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్‌ను వివరణ కోరగా మాంసాహారం అందించే బాధ్యతను తాత్కాలికంగా హెల్పింగ్ హ్యాండ్స్‌కు అప్పగించామని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోంటామన్నారు.

ఏం చేద్దాం..!

(5వ పేజీ తరువాయి)

చేశారు. సమావేశంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, డీఆర్‌సీ వైస్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, మెంబర్ కన్వీనర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ వినూత్న, టెరిటోరియల్ డీఎఫ్‌వో వి.సందీప్‌రెడ్డి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, సీపీవో వాసుదేవరావులు పాల్గొన్నారు. కాగా సమావేశానికి కైకలూరు ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీలు గోపీమూర్తి, జయమంగళ వెంకట రమణ, వంకా రవీంద్రలు గైర్హాజరు అయ్యారు.

ఇళ్లు పూర్తిచేయని వారిపై చర్యలు: మంత్రి కొలుసు పార్థసారథి



కాలనీల్లో ఇళ్లను పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునేందుకు హౌసింగ్ అధికారులు ఎమ్మెల్యేల ద్వారా వివరాలను సేకరించి అందివ్వాలి. సగం ఇళ్లు కట్టి వదిలేసిన కాంట్రాక్టర్లు అవి పూర్తి చేస్తే సరే.. లేకపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. రెవెన్యూ రికవరీ యాక్టు కింద డబ్బులు కట్టిస్తాం. 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్ సెల్ నిర్వహించాలి.

కొబ్బరి నర్సరీపై విచారించాలి: చింతమనేని, ఎమ్మెల్యే, దెందులూరు



విజయరాయి కొబ్బరి నర్సరీ ద్వారా పంపిణీ చేసిన మొక్కలు విత్తనం నాసిరకంగా ఉండడం వల్ల రైతులు నష్టపోయారు. దీనిపై వీసీకి ఫిర్యాదు చేశా. సక్రమంగా విచారణ జర గలేదు. వీసీ వచ్చినప్పుడు హార్టికల్చర్ డీడీ హాజరు కాలేదు. దీనిపై సమగ్ర విచారణ చేయాలి. పెదవేగిలో పలు గ్రామాల్లో 22ఏలో నిషేధిత భూముల కింద లోతట్టు ప్రాంతాలను చేర్చారు. ఇందులో అవకతవకలు జరిగాయి. దోషులను విచారించి న్యాయం చేయాలి.

న్యాయం చేయాలి : పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్యే, ఉంగుటూరు



2014-19 కాలంలో ఇళ్లు మంజూరై నిర్మాణం మధ్యలో ఆగిన లబ్ధిదారులకు బి ల్లులు చెల్లింపు చేయలేదు. వాటిని పూర్తి చేయాలి. పెదనింద్రకొలనులో ఇళ్లస్థలా లు మంజూరు చేసి, తర్వాత రద్దు చేశారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి.

జన్‌మన్ ఇళ్లు పూర్తి చేయాలి: చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



బుట్టాయగూడెం మండలం మోదెల గ్రామంలో అటవీశాఖ అధికారుల ఆంక్షల వల్ల పీఎం జన్‌మన్ పథకంలో గిరిజనులకు మంజూరైన 28 ఇళ్లు నిలిచిపోయా యి. వాటిని తక్షణం పూర్తి చేయాలి.

మౌలికసదుపాయాలు కల్పించాలి : బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే



ఏలూరు నగరంలో పేదలకు ఇచ్చిన ఇళ్లలో పట్టుమని వందలో ఐదుగురు కూడా అక్కడ ఉండడానికి ఇష్టపడడం లేదు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేవు. ఈ దిశగా సౌకర్యాలు కల్పించాలి. రామకృష్ణాపురం, సత్రంపాడు తదితర ప్రాంతా ల్లో కొన్ని స్థలాలను 22ఏ జాబితాలో చేర్చారు. ఈ సమస్యలపై స్పందించాలి.

అదరగొట్టారు

(5వ పేజీ తరువాయి)

సమావేశం నిర్వహణకు నిబంధనలు అంగీకరించనందున శాసనసభ ఆవరణలోనే వేసిన సెట్టింగ్‌లో మాక్ అసెంబ్లీ సమావేశం జరిగింది. నమూనా అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం విద్యార్థులందరినీ నిజమైన శాసనసభ, శాసన మండలి హాల్స్‌కు తీసుకెళ్లి ప్రత్యక్షంగా చూపించి, అన్ని విభాగాల గురించి వివరించారని గైడ్ టీచర్లు తెలిపారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి, తదితరులు



రాజ్యాంగ విశిష్టత తెలియజేస్తున్న వెంపరాల



తిమ్మనగూడెంలో షష్టి ఉత్సవాల్లో చింతమనేని

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

జిల్లా అంతటా అంబేడ్కర్‌కు నివాళులు - పాల్గొన్న అన్ని శాఖల అధికారులు

ఏలూరు క్రైం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):న్యాయ మూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రాజ్యాంగానికి బద్దులమై సమసమాజ నిర్మాణానికి కృషి చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ప్రమాణం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ ప్రమాణం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి కె.రత్నప్రసాద్, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం రామ కృష్ణంరాజు, 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీ కృష్ణ, 7వ అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, 8వ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ బుధవారం రాజ్యంగ దినోత్సవం సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. రాజ్యాంగం విశిష్టత గురించి తెలియజేశారు. మాస్టర్ ట్రైనీ పి.రత్నరాజు, హైస్కూల్ హెడ్మాస్టర్ హరిబాబు, మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనీ పి.రత్నరాజు, సీడీపీవోలు ఇతులసి, పద్మావతి పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ సలహాదారు వెంపరాల నారాయణ మూర్తి పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగం విలువ,ఓటు ప్రాముఖ్యతను తెలియజేశారు. సంక్షేమ సంఘం ఏలూరు అధ్యక్షులు బాపినీడు, ఉపాధ్యక్షులు నారాయణరావు, సీహెచ్.సీతా రామబ్రహ్మం, కార్యదర్శి దేవినేని భాస్కరరావు, జిల్లా కార్యదర్శి దాసరి గణేశ్‌బాబు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: రాజ్యాంగ దినోత్సవాన్ని బుధ వారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాణం-డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై జరిగిన అతిథి ఉపన్యాసకార్యక్రమంలో కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ మూర్తి మాట్లాడుతూ యువత పాఠ్యాంశాలతో పాటు రాజ్యాంగాన్ని కూడా చదివే అలవాటు చేసుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని కోరారు.

● లింగపాలెం: దేశంలో ప్రతి ఒక్కరికీ సమానంగా న్యాయం అందించేందుకే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో భారతరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కెఆర్‌ఎస్ కృష్ణ ప్రసాద్ బుధవారం రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. డిప్యూటీ ఎంపిడివో సుజాత, కార్యాలయ ఏవో. చుక్కా గోపాలకృష్ణ, ఏపీ ఎన్‌ఆర్‌జిఎస్ ఏపివో శ్రీదేవి,సిబ్బంది సుధారాణి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : ఎస్సీ ఎస్టీ మైనార్టీలు ఐక్యతతో రాజ్యాధికారం సాధించవచ్చని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. అంబేద్కర్ వాదుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు ఎ.ఫ్రాన్సిస్, బి.వెంకటేశ్వర రావు, బి.ప్రేమ్‌కుమార్, సీహెచ్.శ్రీను, జె.బాపూజీ, కె. ఇస్మాయిల్, సి.హెచ్.కొండలరావు, బి.రవితేజ ఉన్నారు.

● భీమడోలు: భీమడోలు జడ్పీ హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలతో పాటు విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. పాతూరు ప్రాథమిక పాఠశాలలో భీమడోలు శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● చింతలపూడి: భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పలుచోట్ల ఘనంగా జరిగాయి. పాత చింతలపూడిలో దళిత నాయకులు బోడా అనీష్‌కుమార్, ముళ్లగిరి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యర్రంపల్లిలో ఉపాధ్యాయుడు కాకర్ల సత్యనారాయణ అంబేద్కర్ వేడుకలు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి. శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి రాజ్యాంగ పీఠిక చదివి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. డిప్యూటీ ఈవో పి.సుధాకర్, ఎంఈవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు. పౌరులందరికీ సమన్యాయం అందేలా రాజ్యాంగం రూపొందించారని, దీనిపై ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి సి.హెచ్.మధుబాబు అన్నారు. మూడు లక్షల ఆదాయంలోపు ఉన్న వారందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులని, సమాజంలో వరకట్నం అనే రుగ్మతను నిర్మూలించాలని పేర్కొన్నారు. డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్ స్వరూప, న్యాయవాది భవాని, సోషల్‌వర్కర్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: భారత రాజ్యాంగ సభ 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భాన్ని స్మరించుకుంటూ దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలను నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని భారత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐటిడిఎ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కాలేజి వద్ద జరిగిన వేడుకల్లో అధికారులు, అధ్యాపకులు పాల్గొని వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, డీవైఈవో కుమార్, ఏఎంవో శిరమయ్య, మేనేజర్ ప్రకాశ్, ప్రిన్సిపాల్ మనేంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.మణికుమారి అంబేద్కర్ చిత్ర పటానికి, బొర్రంపాలెంలో ఎస్ఐ ఎం.జయబాబు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో జె.వి.రమణమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ సంపత్ కుమారి, కలపర్తి విజయ్, రామకృష్ణ, గణపతి, మాణిక్యాలరావు పాల్గొన్నారు.


● కామవరపుకోట: తడికలపూడిలో బుధవారం మండల వైసీపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ సెల్ మండల నాయకులు సిరిశెట్టి సిద్ధిరాజు, మండల వైసీపీ అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు గుర్రాల రావి, వైసీపీ నాయకులు బొల్లు సత్యనారాయణ, మేరుగు బాబూరావు, మెడంకి చిన్న, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా షష్టి మహోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్/ కామవరపుకోట/ ఏలూరు రూరల్ / పోలవరం/ దెందులూరు / పెదవేగి / చింతలపూడి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అర్చక బృందం పంచామృతాభిషేకాలు జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి నివేదనలు సమర్పించి భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయాల వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని, శాంతి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పోస్టల్ కాలనీలోని నాగదేవత ఆలయం వద్ద, అశోక్ నగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద, పత్తేబాదలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు షష్టి వేడుకలు నిర్వహించారు. కామవరపుకోటలోని రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని గుర్రాలచెరువు గట్టుపై ఉన్న వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం షష్టి వేడుకలను లలితా శ్రీపీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు అమ్మవార్లకు, శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. పోలవరం మండల వ్యాప్తంగా సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు. దెందులూరు మండలం చల్లచింతలపూడి పంచాయతీ పరిధిలోని తిమ్మనగూడెంలో దాత టీడీపీ నాయకులు సీతంపేట బ్యాంక్ డైరెక్టర్ నర్రవుల వీరవెంకట సత్యనారాయణ, గంగాభవాని దంపతుల అందించిన రూ.12 లక్షలతో నిర్మించిన శ్రీసుబ్రహ్మణ్వేర స్వామి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెదవేగి మండలంలోని పెదవేగి, లక్ష్మీపురం, సీతాపురం, వేగివాడ, వంగూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారి కల్యాణ వేడుక ఘనంగా నిర్వహించారు.పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల్లోని ఆలయాల దగ్గర అన్న సమారాధన నిర్వహించారు. ఆయాచోట్ల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.. సీతాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. కొయ్యలగూడెంలోని నల్లజర్ల రోడ్డులో ఉన్న వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద షష్టి పూజలు నిర్వహించారు. పలువురికి ప్రసాదాలు పంపిణీ చేశారు.



కొయ్యలగూడెంలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



అభివృద్ధికి సహకరించండి: చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి గత 17నెలలుగా ఎమ్మెల్యే బడేటి చంటి నిర్విరామంగా కృషి చేస్తున్నారు.ప్రతి రోజు గ్రీవెన్స్ నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడిక క్కడే పరిష్కరిస్తున్నారు. తరచూ నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల అవసరాలను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అమరావతి రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఏం కావాలన్న చేస్తానని బడేటి చంటికి హామీ ఇచ్చారు.

పొగాకు రైతులను మోసం చేయొద్దు

జంగారెడ్డిగూడెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను మోసగిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం యూటీఎఫ్ భవనంలో పొగాకు రైతుల సమస్యలపై ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వేలం కేంద్రాలకు వస్తున్న మూడు ప్రధానమైన కంపెనీలు పూర్తిగా పొగాకు కొనుగోలు చేయకుండా దళారులకు తక్కువ ధరకే అమ్ముకునే పరిస్థితిని కల్పిస్తున్నారని అన్నారు. మాడు పొగాకును బోర్డులో రూ.50 కు కొనుగోలు చేస్తుంటే అదే పొగాకును దళారులు బయట రూ.30కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. లో గ్రేడు, మాడు పొగాకుకు కనీస ధర కల్పించాలన్నారు. పొగాకు రైతులు బిక్కిన వీరసత్యం, సింహాద్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కావ్య కుటుంబానికి న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న గురుకుల విద్యార్థిని కావ్య కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జొన్నవారిగూడెంలో కావ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న కావ్య మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో పడేసి అధికారులెవ్వరూ పట్టనట్టు వ్యవహరించారని ఆరోపించారు. కావ్య మృతికి కారకులపై, వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్, కావ్య తండ్రి గంగాధర రావు, కుటుంబ సభ్యులు ఉన్నారు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టాన్ని తీసుకొచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్డులో నిరసన చేపట్టారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించేలా ప్రయత్నాలు చేస్తుండడం దారుణమన్నారు. సీపీఎం నాయకులు వంగా గోపీ, బి.రాంబాబు, ఏ.ప్రభాకర రావు, కె.సుబ్బారావు, స్టాలిన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

లింగపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా వండే పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూడాలని లింగపాలెం మండల ఎంఈవో-2 రవీంద్ర అన్నారు. మండలంలోని కలరాయనగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ-2 రవీంద్ర పరిశీలించారు.

పేద దళితులకు న్యాయం చేయండి

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి) : పేదలు దళితులు కున్న హైకోర్టు ఆర్డర్లను ఉల్లంఘిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు పిల్లి పోతురాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మైసన్నగూడెం సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి పంటలను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలిచ్చి రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తిరిగి మహిళల పట్ల దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు.వెంటనే న్యాయం చేయకుంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద మా సమస్య పరిష్కారమయ్యే వరకు రిలే దీక్షలు చేస్తామని అధికారులను హెచ్చరించారు. బాధితులు పులపాకుల వీర్రాజు, పిల్లి వెంకట సుబ్బారావు, పిల్లి అమల, దీప, గంగ, మంగ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

చింతలపూడి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సమావేశాలకు అధికారులు గైర్హాజరుకావడంపై ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు మండిపడ్డారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశాలకు అధికారులు ప్రోటోకాల్ పాటించి హాజరుకాకపోతే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు ప్రజలకు తెలియచేయడానికి ప్రజాప్రతినిధులకు ఎలా తెలుస్తుందన్నారు. సమావేశంలో ఎంపిటిసి విజయభాస్కర్ మాట్లాడుతూ ఎర్రగుంటపల్లి పంచాయతీ మెతుకుమిల్లిగూడెం గ్రామంలో పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని, వర్షం వస్తే నరకమని, ఆరు నెలల క్రితం అధికారుల దృష్టికి తెచ్చినా ఏ మాత్రం పట్టించుకోలేదని ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మరికొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 30లోగా ఇళ్ళ కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఈ సమాచారం ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలియజేయడంలేదన్నారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పేదల సొంతింటి కల సర్వే

లింగపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు మంజూరు చేసే నిమిత్తం లబ్ధిదారులను గుర్తించేలా అధికారులు చర్యలు చేపట్టారు. పీఎం ఈవై-2.0పథకంలో భాగంగా గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది జూలై వరకు సర్వే నిర్వహించి లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ నెలాఖరుకల్లా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారు.దీంతో ప్రతి గ్రామంలోనూ గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ లబ్ధిదారులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ పథకాన్ని పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి స్థలం, ప్రభుత్వం ఇచ్చిన పట్టా కలిగి ఉండాలని, తెల్లరేషన్ కార్డు, ఆదాయ, కులధృవీకరణ పత్రాలు, భార్యభర్తల ఆధార్ కార్డులు జిరాక్స్‌ల రూపంలో అందించాలని, గతంలో ఈ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకున్న వారికి ఈ పథకం వర్తించదని అధికారులు చెపుతున్నారు.

కొవ్వలి పెద్ద చెరువులో వరి కోతలు

దెందులూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : కొవ్వలిలోని పెద్దచెరువు వివాదంలో ఉండగానే వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ చెరువు పరిరక్షణ కోసం అదే గ్రామంలోని గ్రామదీప్ ట్రస్టీ డాక్టర్ వెలమాటి మనోహరి కోర్టును ఆశ్రయించారు. కొవ్వలిలోని 304.7 ఎకరాల చెరువుకు సంబంధించిన ప్రభుత్వ భూమిలో 177 ఎకరాల్లో అక్రమంగా వరి సాగు చేస్తున్నారని, దీని వల్ల తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ చెరువులో చిన్న చిన్న పేద దళిత రైతులు వరి పంటలను పండించి, తినడానికి పంట పండించుకుంటున్నామని పంటలు వేశారు. బుధవారం నుంచి వివాద చెరువులలో పండిన వరి కోత కోసే పనులను రైతులు ప్రారంభించారు. వివాదం ఏ మలుపు తిరుగుతుందో చూడాల్సి ఉంది.

అమరుల త్యాగాలు మరువలేం

టి.నరసాపురం, నవంబరు 26,(ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాలు మరువలేనివని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బాస్కర్ తెలిపారు. మర్రిగూడెం పంచాయతీలోని సున్నపు రాళ్ళపల్లిలో సత్తిరాజు స్థూపం వద్ద చండ్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి జిల్లా కమిటీ సభ్యులు కొండ రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాస్కర్ మాట్లాడుతూ సమాజంలో మనుషులంతా సమానంగా బతకాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రుత్వ, దోపిడీ పాలన కొన సాగిస్తున్నాయన్నారు. అడవిలోని ఖనిజ సంపద కోసమే ఆపరేషన్ కగార్‌ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. జీవించే హక్కును కాలరాస్తున్నాయన్నారు.రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బత్తుల బాబూరావు, గ్రామ కమిటీ ఆదివాసీ సభ్యులు కాటయ్య, తొట్టి నాగేశ్వరరావు, వీరాస్వామి, చిన్ననాగేశ్వరరావు, గొంది ప్రసాద్, వరం రాములమ్మ, కనకయ్య, కోటేష్ పోతురాజు, మడకం వెంకటేష్, కాసిన రాంబాబు, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

1వ తేదీ వరకు నిత్య భిక్ష

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సమేత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నసమాజం ఆధ్వర్యంలో తృతీయ వార్షికోత్సవ స్వాములకు నిత్య భిక్షా కార్యక్రమం అక్టోబరు 13న ప్రారంభించగా నిరంతరం ఘనంగా కొనసాగుతుంది. డిసెంబరు 1వ తేదీతో స్వాములకు నిత్య భిక్షా కార్యక్రమం ముగుస్తుందని అన్నదాన సమాజం అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు తెలియచేశారు. దాతల సహకారంతో భిక్షా కార్యక్రమం ఘనంగా కొనసాగిస్తున్నామని, అధిక సంఖ్యలో స్వాములు ఈ భిక్షా కార్యక్రమంలో పాల్గొంటున్నారని చెప్పారు.

మాక్ అసెంబ్లీ విజేతలకు బహుమతులు

ఏలూరుఅర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి మండల, డివిజన్, నియోజకవర్గ స్థాయిల్లో వ్యాసరచన, వక్తృత్వం, ప్రసంగం పోటీలను నిర్వహించి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున స్టూడెంట్స్‌ను ప్రభుత్వానికి జిల్లా విద్యాశాఖ ప్రతిపాదించిన విషయం విదితమే. వీరినుంచి ఆయా సామాజికవర్గాల వారీగా సమతూకం ఉండేలా నియోజకవర్గానికి ఒకరుచొప్పున ఏడుగురిని బాల ఎమ్మెల్యేలుగా విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఎంపికచేసి రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాల స్టూడెంట్ ఎమ్మెల్యేలతో బుధవారం అమరావతిలో మాక్ అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి మార్షల్ బాధ్యతల నిమిత్తం దెందులూరు నియోజకవర్గానికి చెందిన ఒక విద్యార్థిని మాక్ అసెంబ్లీకి పంపించారు. ఇక మిగిలిన 13మంది విద్యార్థులకు జిల్లా స్థాయిలో బుధవారం సాయంత్రం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి పతకాలు, ప్రశంసాపత్రాలను బహూకరించారు. రాజ్యాంగవిలువలు, నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, ఏఎంవో రెడ్డి రామారావు, డీవైఈవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఛాంపియన్‌గా ఉమ్మడి కృష్ణా జిల్లా బాలికల జట్టు

నూజివీడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ క్రీడా పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా బాలికల జట్టు ఛాంపియన్‌గా నిలిచినట్లు విక్టోరియా టౌన్ హాల్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బాలికల జట్టులో అత్యధికంగా విక్టోరియా టౌన్ హాల్‌కు చెందినవారని ఆయన తెలిపారు.

జాతీయ యోగాసన పోటీలకు హీల్ విద్యార్థి

ఆగిరిపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి హీల్ స్కూల్ విద్యార్థి జాతీయ యోగాసనా పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ యార్లగడ్డ లతా చౌదరి తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చుండూరులో జరిగిన పోటీల్లో సీహెచ్ సురేంద్రబాబు ప్రథమ స్థానం సాధించి డిసెంబరులో కలకత్తాలో నిర్వహించ బోయే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు.

పాల విప్లవ పితామహుడు కురియన్‌కు నివాళి



చాట్రాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ పాల దినోత్సవం సందర్భంగా డాక్టర్ కురియన్ జయంతిని మండలంలోని చీపురుగూడెం పాల సహకార సంఘంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పాడి రైతులు కురియన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాడి ఉద్యమానికి కురియన్ అందించిన సేవలను కొనియాడారు.

నూజివీడు ప్రజల ఆకాంక్షను పక్కన పెట్టవద్దు

నూజివీడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్ష మేరకు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న మంత్రివర్గ ఉపసంఘం నివేదికను పక్కన పెట్టవద్దని నూజివీడు సిటిజన్ ఫోరమ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఫోరమ్ ప్రతినిధులు పీవీ కుమార్, సబ్బినేని శ్రీనివాస్, ఎం రాజశేఖర్, సయ్యద్ ఫరూక్, గొల్లపూడి రవిబాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబునాయుడు రెండుసార్లు నూజివీడులో జరిపిన పర్యటనలలో ప్రజలకు హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజధానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్ కలిగిన నూజివీడు విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో కలిపితే నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఏర్పాటుతో రాజధాని అమరావతిపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. త్వరలోనే సీఎంను కలుస్తామని తెలిపారు.

న్యాయవాదుల ర్యాలీ

నూజివీడు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రజల సెంటిమెంటును కాపాడుతూ నూజివీడు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోను, ముఖ్యమంత్రి హోదాలోను చంద్రబాబునాయుడు నూజివీడు సెంటిమెంట్‌ను గౌరవిస్తూ ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను యథావిధిగా ఉంచుతున్నట్లు మంత్రివర్గం ప్రకటించిందని నూజివీడు సెంటిమెంట్ గౌరవిస్తూ నూజివీడు నియోజకవర్గంను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మన్నెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు గుడ్డు.. కట్!

(5వ పేజీ తరువాయి)

సంస్థ తప్పుకున్నట్టు సమాచారం. దీంతో మూడు రోజులుగా విద్యార్థులకు గుడ్డు అందడం లేదు. మరోవైపు శాఖాహార భోజనంలో ఉదయం అల్పాహారంగా కట్టి పొంగలి ఇస్తున్నారని ఉదయం మసాలాతో కూడిన ఆహారం తినడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్‌ను వివరణ కోరగా మాంసాహారం అందించే బాధ్యతను తాత్కాలికంగా హెల్పింగ్ హ్యాండ్స్‌కు అప్పగించామని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోంటామన్నారు.

అదరగొట్టారు

(5వ పేజీ తరువాయి)

సమావేశం నిర్వహణకు నిబంధనలు అంగీకరించనందున శాసనసభ ఆవరణ లోనే వేసిన సెట్టింగ్‌లో మాక్ అసెంబ్లీ సమావేశం జరిగింది. నమూనా అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం విద్యార్థులందరినీ నిజమైన శాసనసభ, శాసనమండలి హాల్స్‌కు తీసుకెళ్లి ప్రత్యక్షంగా చూపించి, అన్ని విభాగాల గురించి వివరించారని గైడ్ టీచర్లు తెలిపారు.

ఏం చేద్దాం..!

(5వ పేజీ తరువాయి)

చేశారు. సమావేశంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, డీఆర్‌సీ వైస్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, మెంబర్ కన్వీనర్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ వినూత్న, టెరిటోరియల్ డీఎఫ్‌వో వి.సందీప్‌రెడ్డి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, సీపీవో వాసుదేవరావులు పాల్గొన్నారు. కాగా సమావేశానికి కైకలూరు ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీలు గోపీమూర్తి, జయమంగళ వెంకట రమణ, వంకా రవీంద్రలు గైర్హాజరు అయ్యారు.

ఇళ్లు పూర్తిచేయని వారిపై చర్యలు : మంత్రి కొలుసు పార్థసారథి



జిల్లాలో వివిధ కాలనీల్లో ఇళ్లను పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునేందుకు హౌసింగ్ అధికారులు ఎమ్మెల్యేల ద్వారా వివరాలను సేకరించి అందివ్వాలి. సగం ఇళ్లు కట్టిన వదిలేసిన కాంట్రాక్టర్లు అవి పూర్తి చేస్తే సరే.. లేకపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. రెవెన్యూ రికవరీ యాక్టు కింద డబ్బులు కట్టిస్తాం. 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్ సెల్ నిర్వహించాలి.

విజయరాయి కొబ్బరి నర్సరీపై విచారించాలి : చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే



విజయరాయి కొబ్బరి నర్సరీ ద్వారా పంపిణీ చేసిన మొక్కలు విత్తనం నాసిరకంగా ఉండడం వల్ల రైతులు నష్టపోయారు. దీనిపై వీసీకి ఫిర్యాదు చేశా. సక్రమంగా విచారణ జరగలేదు. వీసీ వచ్చినప్పుడు హార్టికల్చర్ డీడీ హాజరు కాలేదు. దీనిపై సమగ్ర విచారణ చేయాలి. పెదవేగిలో పలు గ్రామాల్లో 22ఏలో నిషేధిత భూముల కింద లోతట్టు ప్రాంతాలను చేర్చారు. ఇందులో అవకతవకలు జరిగాయి. దోషులను విచారించి న్యాయం చేయాలి.

ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలి : పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే



2014-19 కాలంలో ఇళ్లు మంజూరై నిర్మాణం మధ్యలో ఆగిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదు. వాటిని పూర్తి చేయాలి. పెదనిండ్రకొలనులో ఇళ్లస్థలాలు మంజూరు చేసి, తర్వాత రద్దు చేశారు. వారిలో అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయాలి.

జన్‌మన్ ఇళ్లు పూర్తి చేయాలి: చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



బుట్టాయగూడెం మండలం మోదెల గ్రామంలో అటవీ శాఖ అధికారుల ఆంక్షల వల్ల పీఎం జన్‌మన్ పథకం లో గిరిజనులకు మంజూరైన 28 ఇళ్లు నిలిచిపోయాయి. వాటిని తక్షణం పూర్తి చేయాలి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : బడేటి చంటి, ఏలూరు ఎమ్మెల్యే



ఏలూరు నగరంలో పేదలకు ఇచ్చిన ఇళ్లలో పట్టుమని వందలో ఐదుగురు కూడా అక్కడ ఉండడానికి ఇష్టపడడం లేదు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేవు. ఈ దిశగా సౌకర్యాలు కల్పించాలి. రామకృష్ణాపురం, సత్రంపాడు తదితర ప్రాంతాల్లో కొన్ని స్థలాలను 22ఏ జాబితాలో చేర్చారు. ఈ సమస్యలపై స్పందించాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



తుక్కులూరులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి శంకుస్థాపన చేసిన దృశ్యం



గొల్లపల్లిలో వైద్య ఆరోగ్యశాఖ స్థలంలో భవన నిర్మాణం

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా

అధికారులు పట్టించుకోరెందుకో..?

(నూజివీడు టౌన్-ఆంధ్రజ్యోతి)

నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురి అవుతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పక్కా భవన నిర్మాణాలను చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో ఆంజనేయ గట్టు 2006 లే ఔట్‌లోని ప్లాట్ నెంబరు 16లో ఖాళీగా ఉన్న 271 గజాల స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపడుతున్నారు. ఈ స్థలం విలువ మార్కెట్‌లో ప్రస్తుతం రూ. 20 లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. రెవెన్యూ అధికారులు హెచ్చరికలు జారీ చేసినా ఆదేశాలు బేకాతరు చేసి అక్రమ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం విశేషం. గ్రామ సచివాలయానికి కూత వేటు దూరంలోని ప్లాట్ ఆక్రమిస్తుంటే కఠిన చర్యలు ఎందుకు తీసుకోవట్లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా గొల్లపల్లి గ్రామంలో పీహెచ్‌సీ వద్ద రోడ్డు వెంబడి అత్యంత విలువైన వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఖరీదైన స్థలాన్ని ఆక్రమించి గ్రామ రెవెన్యూ ఉద్యోగికి సంబంధించిన బంధువు అక్రమ నిర్మాణం చేపట్టాడు. దీనిపై గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా అక్రమ నిర్మాణం మాత్రం కొనసాగుతూ ఉండడం విశేషం. అయితే సదరు స్థలం వైద్య ఆరోగ్యశాఖదే అయినా ఆ అధికారులు ఆ స్థలంపై కన్నెత్తి చూడకపోవడం విశేషం. కాగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై నూజివీడు తహసీల్దార్ భద్రుని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.







కైకలూరు, చనుబండ, ముసునూరు మండల పరిషత్ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేడ్కర్‌కు ఘన నివాళులు.. ప్రతిజ్ఞలు

కైకలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని ఎంపీపీ అడవి కృష్ణ, నియోజకవర్గ టీడీపీ కోకన్వీనర్ బి. విజయలక్ష్మీ అన్నారు. బుధవారం భారతరాజ్యాంగాన్ని పురస్కరించుకొని కైకలూరులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నేతలు, దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కెకె బాబు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా, ఈదా వెంకటస్వామి, మైనార్టీ నాయకుడు రసూల్‌ఖాన్, ఎంపీడీవో ఆర్ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు. కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వై శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

ముదినేపల్లి: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విజయ ఫార్మసీ కళాశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. తహసీల్దార్ లతీఫ్ పాషా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని తెలిపారు. కైకలూరు అడ్వొకేట్లు రాంబాబు, శివ ప్రసాద్, పవన్, కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో రాజ్యాంగ విలువలు కాపాడుతామని విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు.

నూజివీడు: నూజివీడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా నూజివీడు తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ బద్రు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చెన్ను రాఘవేంద్రనాథ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కలిదిండి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో ఫణీంద్ర, డిప్యూటీ ఎంపీడీవో మారుతి ప్రసాద్, ఏవో మురళీ మోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చాట్రాయి: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని, ఇది అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చిందని వక్తలు అన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయం, చనుబండ సచివాలయం, జడ్పీ హైస్కూల్, చిన్నంపేటలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, ఉపాధ్యాయులు రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించి, రాజ్యాంగ పీఠిక చదివి వినిపించారు. నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, నక్కా రాము, బుర్రి శ్రీకర్, మారేశ్వరరావు, కొమ్ము ఆనందం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: అంబేడ్కర్ దేశానికి అత్యుత్తమ రాజ్యాంగం అందించడంతోనే అభివృద్ధి సాధిస్తున్నామని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగాన్ని చదివి అమలు పరచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఎల్ఎస్ భాస్కరరావు, గాలి నాగయ్య, మెండా సురేస్, అధ్యక్షులు కొరపాటి శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: శోభనాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 8, 9 తరగతి విద్యార్థులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. స్పీకర్, పాలకపక్షం, ప్రతిపక్షం ఎమ్మెల్యేల పాత్రలు పోషించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి-2 కె. ఆనంద్‌కుమార్ పాల్గొని క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చొప్పరమెట్లలోని కేకేఆర్ హ్యాపీ వ్యాలీ పాఠశాలలో ప్రిన్సిపల్ మంజునాథ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, రాజ్యాంగం విశిష్టతను తెలియజేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు నిర్వహించారు. డీన్ రాఘురాం పాల్గొన్నారు.

ముసునూరు: భారత రాజ్యాంగం ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకోవాలని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. మండల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదించిన ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఏవో ఛాయాదేవి, కార్యాదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి అంతరాలయ దర్శనం

టికెట్ రుసుము రూ.500

ద్వారకాతిరుమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేదీప్యమానంగా వెలుగొందుతూ అంతరాలయ ంలో కొలువుదీరిన శ్రీవారి దివ్యమంగళ రూపాన్ని దగ్గరగా కనులారా వీక్షించాలన్న భక్తుల ఏళ్లనాటి కల నేడు సాకారం కానుంది. అర్ధ దశాబ్ద కాలంగా నిలిచిన శ్రీవారి అంతరాలయ దర్శన భాగ్యం భక్తులకు నేటి నుంచి లభించనుంది. గురువారం నుంచి అంతరాలయ దర్శనాన్ని పునః ప్రారంభి ంచేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అయితే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో అంతరాలయ దర్శనాన్ని అలాగే ముఖమండప (అమ్మవార్ల ముందు నుంచి భక్తులను క్యూలైన్లలో పంపే ఏర్పాటు) దర్శనాన్ని రద్దు చేస్తామని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ప్రకటించారు. అలాగే అంతరాలయానికి వెళ్లే ప్రతి భక్తుడు రూ.500 టికెట్టు కొనుగోలు చేయాల్సి ఉంది. అధికారులు తీసుకున్న ఈచర్యతో ఇక దళారులకు చెక్ పడినట్లేనని భక్తులు భావిస్తు న్నారు. ఇప్పటి వరకూ అంతరాలయ దర్శనం కోసం కొందరు భక్తులు దళా రులను ఆశ్రయిస్తున్నారు. వారు ఒక్కో భక్తుని నుంచి నగదు వసూలు చేసి దర్శనానికి పంపి స్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు టికెట్టు ఉండటం వల్ల దళారులతో ఇక పనిలేదని భక్తులు అంటున్నారు.

సైన్సు ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో దాతలు వీరపనేని సాయిరాణి, సంతోష్ కుమార్‌లు రూ.20 లక్షల ఆర్థిక సాయంతో నిర్మించే సైన్సు ల్యాబ్ నిర్మాణానికి సర్పంచ్ పేటేటి స్వర్ణ కుమారి, హెచ్ఎం అనిశెట్టి శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. జడ్పీ హైస్కూల్‌లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు పేటేటి కనక లింగేశ్వరరావు, జక్కుల విజయ్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి పూజలు..



కైకలూరు చిన్నచెరువుగట్టుపై గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి



సింగరాయపాలెంలో స్వామివారి కల్యాణం

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని ప్రసిద్ధ శ్రీ వల్లీదేవ సేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి షష్ఠి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, ఉప్పలపాటి విమల, నీలం శివరమేష్, పరసా కృష్ణ, బెజవాడ నాగవెంకట రాధాకృష్ణ, శొంఠి నాగకొండ తదితరులు స్వామికి షష్ఠి పూజలు నిర్వహించి పుట్టలో పాలుపోశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి పుట్టలో పాలు పోశారు. ఆలయ ఆవరణలోని నాగమల్లి చెట్టు వద్ద నాగ ప్రతిమలకు మహిళలు పూజలు చేసి పాలు పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహా రావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావూరు నాగరాజు తదితరులు పూజలు నిర్వహించారు. డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి, మండవల్లి ఎస్ఐలు వీరభద్రరావు, రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా కల్యాణం: బుధవారం రాత్రి స్వామి దివ్య కల్యాణమహోత్సవం కన్నులపండుగగా జరిగింది. సుమారు 60 మంది దంపతులు పాల్గొన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ ఆర్ గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొమ్మిరవి కుమార్‌తో పాటు పలువురు సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ వల్లీదేవసేనలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని యాజ్ఞీకుడు గూడూరు శివరామకృష్ణ, అర్చకులు కోట శివశంకర శర్మ, తేలేటి వీరభద్ర శర్మలు జరిపించారు. వందలాది మంది భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణాన్ని తిలకించారు.

కైకలూరు: షష్ఠి మహోత్సవాల సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బుధవారం ఉదయం నుండి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకొని పుట్టలో పాలు పోసి భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. పిల్లలకు తల నీలాలు ఇవ్వడం, పుట్టబూరెలు పోయడం వంటి పూజలను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కైకలూరు చిన్నచెరువుగట్టుపై వేంచేసియున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆచవరంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భారీ అన్నసమారాధన జరిగింది.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం అన్నవరం లోని సుబ్రహ్మణ్యశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా సాగింది. పంచా మృత అభిషేకాలు, పూజలు ప్రధాన అర్చకులు బావ రాజు పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూజి వీడు గాంధీనగర్‌లోని ఆలయంలో కల్యాణం వైభవం గా జరిగింది. దంపతులు పీటలపై కూర్చొని గౌరీ పూజ, కలశ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పామర్తి గణేష్, కపాల సతీష్, చింతా మల్లికార్జునరావు, సాయిలు పర్యవేక్షించారు.

కలిదిండి: పెదలంకలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ వీఆర్వో అడివి రామదాసు దంపతులు అఖండ దీపారాధన, అష్టోత్తర పూజ నిర్వహించారు. మాజీ పంచాయతీ కార్యదర్శి పోకల వెంకటేశ్వరరావు దంపతులు పుట్టలో పాలు పోసిన అనంతరం భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. దాత పోకల శ్రీనివాస్ ఆర్థిక సాయంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కుల వెంకటాచలం, మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీ రావు, సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముసునూరు: గోపవరంలోని ప్రత్యక్ష నాగేంద్ర స్వామి ఆలయంలో సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని 59 మంది దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. అలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించింది. రాత్రి కల్యాణమూర్తులను ఊరిగించారు.



పెదలంకలో స్వామి ప్రత్యేక అలంకరణ

ఎన్పీటీఈఎల్ పరీక్షల్లో 97.5 శాతం ఉత్తీర్ణత

నూజివీడు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ అండ్ ఎన్‌హేన్స్‌డ్ లెర్నింగ్ కోర్సులలో ఆర్జీయూకేటీ పరిధిలో ఇంజనీరింగ్ తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులు 97.5% ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ తెలిపారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి పరుస్తూ ప్లేస్మెంట్‌లలో ఉపయుక్తంగా ఉండేలా రూపొందించిన ఎన్పీటీఈఎల్ కోర్సుల్లో ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో మొత్తం 10,500 మంది విద్యార్థులు చేరగా 10,113 మంది సర్టిఫికెట్లు సాధించారన్నారు. నూజివీడు క్యాంపస్ నుంచి 2473 మంది సర్టిఫికెట్లు పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

ఆభరణం బహూకరణ

ముదినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణే శ్వరస్వామివారి దేవస్థానంలో షష్ఠి ఉత్సవాల సందర్భంగా బుధవారం గుడివాడకు చెందిన సిద్ధపురెడ్డి వెంకట వరప్రసాద రావు, సత్యవతి దంపతులు రూ.2.50 లక్షల విలువైన 19 గ్రాముల బంగారు ఆభరణాన్ని బహూకరించారు. దాతలను దేవస్థానం తరఫున సత్కరించారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ధర్నా

కలిదిండి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేట కలిదిండిలో ప్రధాన రహదారి వెంబడి నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. సుమారు 70 విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. 30 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలను ఇప్పటి వరకు మార్పు చేయలేదని విద్యుత్ తీగలు క్రిందకు వేలాడుతుండటంతో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రెండు రోజుల క్రితం విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్ గడ్డి దగ్ధమయిందన్నారు. నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను సరి చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపించారు. భట్రాజు ఏసుబాబు, నాగ రాజు, శివ సముద్రుడు, బాసిన శ్రీనివాసరావు, బోయిన గోవింద్, యలవర్తి వీరబాబు, బుసనబోయిన త్రిమూర్తులు, బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కైకలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న మహిళపై హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు కైకలూరు టౌన్ ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. మంగళవారం కైకలూరులో మహిళపై సీతనపల్లి గ్రామానికి చెందిన చిన్నం ఏసోబు కత్తితో దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఆమె తీవ్ర గాయాలతో ఏలూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన ఏసోబును అతని స్వగ్రామమైన సీతనపల్లిలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో మచిలీపట్నం సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అయితే నేర తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఈ దాడి ఘటనపై అమరావతి, ఏలూరు నుంచి క్లూస్ టీం విచారణ చేపట్టింది. దాడి జరిగిన ప్రదేశంలో రక్త నమూనాలను సేకరించారు. ప్రభుత్వం మహిళపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ ప్రత్యేక దృష్టి సారించి పూర్తి విచారణకు ఆదేశించింది.

స్కూల్ బస్, ఆటో ఢీ.. ఒకరికి గాయాలు

చాట్రాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం గ్రామ పరిధిలో బుధవారం ప్రైవేటు స్కూల్ బస్, ట్రక్ ఢీకొన్న ఘటనలో ట్రక్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు స్కూల్ బస్ చింతలపూడి వైపు వెళుతుండగా. ట్రక్ ఆటో పోలవరం వైపు వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. పోలీసులు ట్రక్ ఆటో డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు క్లియర్ చేశారు.